
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 26 ఆగస్టు 2024



నేడు కృష్ణాష్టమి

పలు ఆలయాల్లో ఉత్సవాలు

నేడు (సోమవారం) శ్రావణ బహుళ అష్టమి. శ్రీకృష్ణుడు పుట్టినరోజు కృష్ణాష్టమిని జరుపుకోనున్నారు. జిల్లాలోని పలు కృష్ణమందిరాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంరించారు. పలుచోట్ల ఉత్సవాలు నిర్వహించడంతోపాటు ఉట్టి మహోత్సవాన్ని చేపట్టనున్నారు. చిన్నారులను చిన్నికృష్ణుడి వేషధారణలో తీర్చిదిద్ది, ఇంట్లోకి ప్రవేశిస్తున్నట్లు పాదముద్రలు చిత్రీకరిస్తారు. నెల్లూరులోని ఇస్కాన్ సిటీతోపాటు అన్నీ వైష్ణవాలయాల్లో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

కందుకూరు సబ్ కలెక్టరుగా శ్రీపూజ


శ్రీపూజ

కందుకూరు, ఆగస్టు 25: కందుకూరు సబ్ కలెక్టరుగా తిరుమాని శ్రీపూజ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం దొంగపిండి గ్రామానికి చెందిన శ్రీపూజ తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. ఆమె సూరత్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తిచేసి సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. రెండో ప్రయత్నంలోనే సివిల్స్‌లో 62వ ర్యాంకు సాధించిన ఆమె ఆంధ్రా క్యాడర్‌కి నియమితులయ్యారు. ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయిన వెంటనే తొలి పోస్టింగ్‌గా ఆమెను కందుకూరు సబ్‌కలెక్టరుగా నియమించారు. కాగా ఇప్పటివరకు కందుకూరు సబ్‌కలెక్టరుగా పనిచేసి నాలుగురోజులక్రితం కర్నూలు కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయిన జీ విద్యాధరిని అక్కడి నుంచి మార్పుచేసి చిత్తూరు జేసీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు.

ప్లీజ్.. హెల్ప్ !

- ఆక్రమణల తొలగింపునకు సహకరించండి
- రెవెన్యూ, పోలీసులకు లేఖ రాసిన ఇరిగేషన్ అధికారులు
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలోని అక్రమ లేఅవుట్‌లో కాలువను ఆక్రమించి నిర్మించిన రోడ్లను తొలగించేందుకు సహకరించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఇరిగేషన్ ఇంజనీర్లు కోరారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు శనివారం లేఖ రాశారు. ఈనెల 24వ తేదీన 'ఈ సారి కోడూరు కబ్జా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. కోడూరు, లేబూరు, బురద కాలువల ఆక్రమణలపై నెల్లూరు రూరల్ తహసీల్దార్, నెల్లూరు రూరల్ సీఐలకు లేఖ రాశారు. తమ కాలువలను సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తే ఆక్రమణలు తొలగిస్తామని పేర్కొన్నారు. ఈ ఆక్రమణల తొలగింపునకు పోలీసు బందోబస్తు ఇవ్వాలంటూ కోరారు. అయితే ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందిస్తారా..? అన్నది ఆసక్తిగా మారింది. ఆక్రమణలు తొలగించాలని ఏడాది క్రితం హైకోర్టు ఆదేశించినా నెల్లూరు ఆర్డీవో నోటీసులు ఇచ్చి వెనక్కు తీసుకున్నారు. ఆ ధైర్యంతో ఆక్రమణదారులు తాజాగా మరో కాలువను ఆక్రమించి రోడ్డు వేశారు. అక్రమార్కులు బరితెగించి రైతుల ఆస్తులు ఆక్రమిస్తుంటే అధికార యంత్రాంగం కాసుల మత్తులో తూలుతూ ఉంది.

ఆర్టీసీ బస్సులు పెంచాలి

- ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి


నాయకత్వ క్లాసుల్లో మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట),ఆగస్టు 25: ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జెట్టి శేషారెడ్డి భవన్‌లో జరుగుతున్న తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచి ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీఐటీయూ నాయకుడు ఎం మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు న్యాయ పరంగా రావాల్సిన రాయితీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్‌కే జిలానీబాషా, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కట్టా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలు
- సీసీ ఫుటేజీకి దొరక్కుండా ముఖానికి మాస్కులు
- నిందితులు కొత్తవారు కావడంలో కష్టంగా రికవరీలు
- అప్రమత్తత ఒక్కటే మార్గం

బిహార్ దొంగల బీభత్సం

ఈనెల 8న దర్గామిట్టలో చోరీకి యత్నిస్తుండగా సీసీ ఫుటేజీలో నమోదైన నిందితుడి చిత్రం



నెల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బిహార్, ఉత్తరప్రదేశ్(యూపీ) రాష్ట్రాల దొంగల దండు పడింది. ఇంటికి తాళం వేస్తే చాలు సంపద మొత్తం చోరీకి గురవుతోంది. నిందితులు కొత్తవారు, అందులోనూ పక్కరాష్ట్రాలకు చెందిన వారు కావడంతో వారిని గుర్తించడం, చోరీ సొత్తు రికవరీ చేయడం పోలీసులకు కష్టమవుతోంది. వివిధ కారణాలతో పోలీసులు నిస్సహాయులుగా మారుతున్న నేపథ్యంలో ప్రజలే అప్రమత్తంగా ఉండటం మంచిదనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

- ఈనెల 8న దర్గామిట్ట సీసీఎస్ నగర్‌లో చోరీ జరిగింది. యజమానులు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ప్రధాన ద్వారం పగులగొట్టి కబోర్డ్‌లోని రూ. 2.50 లక్షలు పట్టుకుపోయారు.
- అదేరోజు వెంకటేశ్వరపురం లక్ష్మీవీధిలో తాళం వేసిన ఇంట్లోకి చొరబడి రూ. 10లక్షల విలువైన బంగారు,వెండి ఆభరణాలు, వస్తువలను దొంగలించారు
- ఈనెల 11న ఎఫ్‌సీఐ కాలనీలో తాళం వేసిన ఇంట్లోకి చొరబడి రూ. 23లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మోటారు సైకిల్‌ను ఎత్తుకెళ్లారు.

ఇవి ఉదాహరణలు మాత్రమే. ఇటీవల జిల్లాలో ఈ తరహా దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

● చేయితిరిగిన దొంగల ముఠా

జిల్లాలో సంచరిస్తున్న దొంగల ముఠా చోరవృత్తిలో ఆరితేరినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఇంట్లో మనుషులు నిద్రిస్తున్నా, శబ్ద రాకుండా తలుపులు పగులగొట్టి చోరీ చేయడం వీరి నైపుణ్యానికి నిదర్శనం. కాగా దొంగతనానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించకుండా జాగ్రత్త పడటం కూడా విశేషం. ఈనెల 8న నెల్లూరు దర్గామిట్టలో జరిగిన చోరీ ఘటనలో ఇంట్లో మనుషులు నిద్రిస్తుం డగానే శబ్దం రాకుండా ప్రధాన ద్వారం పగులగొట్టి హాల్‌లో ఉన్న విలువైన వస్తువులు,నగదు దోచుకె ళ్లారు. ఈ దొంగతనానికి సంబంధిం చిన సీసీ ఫుటేజీలో దొంగలు గడ్డపార చేతపట్టుకొని ఇంట్లోకి ప్రవేశించిన దృశ్యాలు నమోదయ్యాయి. బెడ్‌రూంలో నిద్రిస్తున్న వారికి ప్రధాన ద్వారం బద్దలు కొట్టిన శబ్దం వినబడకుండా జాగ్రత్తలు తీసుకున్నారంటే చోరవృత్తిలో వీరి నైపుణ్యం ఏ పాటిదో అర్థం అవుతుంది. అలాగే పైమూడు దొంగతనాల్లో ఒక్క ఆధారం కూడా లభించకుండా జాగ్రత్త పడటం మరో విశేషం. ముఖాలను ఏమాత్రం గుర్తుపట్టడానికి వీలు లేకుండా తల వెంట్రుకలతో సహా మొత్తం కవర్ చేస్తూ గుడ్డకానీ, మాస్కులు కానీ ధరిస్తారు. హేర్‌స్టైల్ కనిపించినా గుర్తుపడతారనే ఉద్దేశంతో మరిన్ని జాగ్రత్తలు పడుతున్నారు. చేతులకు గ్లౌజులు వేసుకోవడం ద్వారా వేలిముద్రలు లభించకుండా చూసుకుంటున్నారు. ఈ జాగ్రత్తల కారణంగా సీసీ ఫుటేజీలో రికార్డు అయినా దొంగలను గుర్తించడానికి ఏ మాత్రం ఆస్కారం ఉండదు.


నెల్లూరు నవాబుపేటలో చోరీకి పాల్పడుతుండగా సీసీ ఫుటేజీలో నమోదైన చిత్రం(ఫైల్)

● బిహార్, యూపీ ముఠాగా అనుమానం

దొంగల హావభావాలు, నేరవిధానం, వినియోగించే వస్తువుల ఆధారంగా వీరు బిహార్, యూపీ రాష్ట్రాలకు చెందిన దొంగల ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు.

వీరు వాడే చెప్పులు, దుస్తులు ధరించే తీరుపై అనుమానాలకు మరింత బలం చేకూర్చుతున్నాయి. పైగా చోరీ చేసిన మోటారు సైకిళ్లు కూడా ఆనవాళ్లు లేకుండా పోవడంతో ఖాకీ సినిమా తరహాలో ఈ ముఠా ఏదైనా లారీ లాంటి భారీ వాహనాన్ని వెంట తెచ్చుకొని అందులో ఎప్పటికప్పుడు చోరీ సొత్తును రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్నారేమో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలే నిజమైతే చోరీలకు ఒకరిద్దరు రాలేదని, పెద్ద ముఠానే జిల్లాలో ప్రవేశించిందని భావించవచ్చు.

● అప్రమత్తతే శ్రీరామరక్ష

దొంగతనాల విషయంలో పోలీసులనే పూర్తి స్థాయిలో బాధ్యులను చేయడం సరైన పద్ధతి కాదు. ఎవరికి వారు జాగ్రత్తగా ఉంటే చాలా వరకు నష్టాలను నివారిం చుకునే అవకాశం ఉంది. సాధ్యమైనంత వరకు విలు వైన బంగారం ఆభరణాలను ఇంట్లో ఉంచుకోవడం కంటే బ్యాంకులు లేదా ఇతర సురక్షితమైన ప్రదేశాల్లో దాచుకోవడం ఉత్తమం. అత్యవసరానికి కొంత సొమ్ము తప్ప మిగిలిన నగదును బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవడం అన్నింటికన్నా ఉత్తమం. ఇంటికి తాళం వేసుకొని బయటి ప్రాంతాలకు వెళ్లే సమయంలో విలువైన ఆభరణాలు, నగదును వెంట తీసుకెళ్లడం, లేదా నమ్మకస్తులకు అప్పగించి వెళ్లడం మరో మార్గం. ఎక్కువ రోజులు డోర్ లాక్ చేయాల్సి వస్తే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం, ఇరుగుపొరుగుకు చెప్పి వెళ్లడం, వీలైతే ఇంటికి సీసీ కెమరాలు అమర్చుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటే చాలావరకు దొంగల బారినుంచి తప్పించుకునే వీలుంటుంది. ఆ దిశగా ప్రజలు ప్రయత్నించాలి.

స్థానికులు కానేకాదు

ప్రస్తుతం ఇళ్లను కొల్లగొడుతున్న దొంగలముఠా సభ్యులు స్థానికులు కాదని పోలీసులు భావిస్తున్నారు. ఇందుకు బలమైన కారణాలు ఉన్నాయి. స్థానికంగా ఉండే ఇరుగు,పొరుగు దొంగలైతే రోజుకు ఒక ఇంటిని లక్ష్యంగా చేసుకొని కాపుకాచి, అదను దొరికినప్పుడు దొంగతనాలకు పాల్పడుతారు. కానీ నెల్లూరు నగరంలో చోరీకి పాల్పడిన ముఠా ఏదో ఒక ఇంటినే టార్గెట్ చేసుకోలేదు. ఒక్కొక్క రోజు నాలుగైదు ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. కిటికీలు, ఇతర మార్గాల నుంచి ఇంట్లోని మనుషులను, స్తోమతను గమనించి చోరీలు చేస్తున్నారు. ఈ కోణంలో చూస్తే వీరు స్థానికులు కాదని, పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన దొంగల ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు.


పొదుపు సంఘాల మహిళలకు రుణాల చెక్కును అందచేస్తున్న డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి

మహిళలను లక్షాధికారులను చేయటమే లక్‌పతి దీదీ ప్రధాన లక్ష్యం

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 25: స్వయం సహాయక సంఘాల మహిళలను లక్షాధికారులను చేయడమే లక్‌పతి దీదీ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తెలిపారు. లక్‌పతి దీదీ కార్యక్ర మంలో భాగంగా మహారాష్ట్రలోని జలగాన్ నుంచి ఆదివారం లైవ్ ద్వారా దేశంలోని మహిళా సంఘా లను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. ఆ లైవ్ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని తిక్కన భవన్ నుంచి పొదుపు మహిళలు, డీఆర్‌డీఏ పీడీ తదితరులు తిలకించారు. అనంతరం సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని పొదుపు సంఘాల్లో ఉన్న 1.20 లక్షలమంది మహిళలను లక్షాధికారులను చేయటమే లక్ష్యంగా లక్‌పతి దీదీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కమ్యూనిటీ రిసోర్సు పర్సన్స్ ద్వారా మహిళల ఎంపికను పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రధాని మోదీ సంకల్పం మేరకు జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వివిధ వ్యాపారాలకు అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యాలు, రుణం సౌకర్యం కల్పించి వారి జీవనప్రమాణాలను మెరుగు పరిచేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలకు ప్రశంసా పత్రాలు అందచేశారు. 869 స్వయం సహాయక సంఘాలకు రూ.105.75 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా రూ. 7కోట్ల ఉన్నతి రుణాలు, స్త్రీనిధి ద్వారా రూ.50కోట్ల బ్యాంకు చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శారమ్మ, ఏపీడీ రాజు, ఏపీఎంలు, డీపీఎంలు, పొదుపు సంఘాల మహిళలు, డీఆర్‌డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో దొంగలు పడ్డారు !?

- సేఫ్‌లాకర్‌లో కనిపించని రూ.50 లక్షల విలువైన బంగారం
- వెంకటాచలం ఠాణా పరిధిలో ఘటన
- వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలూ గల్లంతు
- వివాదాస్పద ఎస్సై సమయంలో జరిగినట్లు అనుమానం
- గత ప్రభుత్వంలో తొక్కిపెట్టిన ఉన్నతాధికారులు
- తాజాగా కొత్త అధికారుల రాకతో బట్టబయలు

నెల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌ల్లో దొంగలు పడ్డారా.. వెంకటాచలం పోలీసుఠాణాలోని సేఫ్ లాకర్‌లో ఉంచిన బంగారం మాయమైందా... సుమారు రూ.50 లక్షల విలువైన బంగారాన్ని రక్షించాల్సిన పోలీసులే భక్షించారా..? అంటే విశ్వసనీయవర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. ఓ కేసులో పట్టుబడిన బంగారం పోలీసు స్టేషన్‌లో సేఫ్‌గా ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం అది కనిపించడం లేదని సమాచారం. అక్కడ పనిచేసిన ఓ వివాదాస్పద ఎస్సై హయాంలో ఈ బంగారంపై కేసు నమోదు చేశారని, ఆ బంగారాన్ని హ్యాండ్‌ఓవర్ చేసుకున్నట్లు సంతకాలు పెట్టి ఉన్నది కూడా సదరు వివాదాస్పద ఎస్సైనేనని తెలుస్తోంది. ఆ ఎస్సై పని చేసిన సమయంలోనే సుమారు 800 గ్రాముల వరకు ఉన్న ఆ బంగారం మాయమైనట్లు పోలీసువర్గాలు అంటున్నాయి. అయితే ఆ ఎస్సై వెంకటాచలం నుంచి బదిలీ అయ్యి ఏడాదన్నర దాటింది. ఈ వ్యవహారం ఇప్పుడు బయటపడడం పలు అనుమానాలకు తావిస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పోలీసుల బదిలీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే వెంకటాచలం స్టేషన్‌కు కూడా కొత్త అధికారులు వచ్చారు. సాధారణంగా పాత అధికారి చార్జి అప్పగించేటప్పుడు అప్పటి వరకూ సేఫ్ కస్టడీలో ఉన్న వస్తువులను కూడా అప్పగించి వెళతారు. అయితే ఇప్పుడు కొత్త సీఐ వచ్చాక పాత కేసుకు సంబంధించిన బంగారం సేఫ్ లాకర్‌లో లేదని గుర్తించినట్లు తెలిసింది. బంగారం మాయం గురించి స్టేషన్‌లో ఆరా తీయగా, గతంలో జరిగిన వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీఐ బంగారం మాయంపై ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ అంశం ఇప్పుడు పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.

● ఏడాది క్రితమే తెలిసినా..

వెంకటాచలం స్టేషన్‌లో బంగారం కనిపించని విషయం ఏడాది క్రితమే వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. వివాదాస్పద ఎస్సై బదిలీ అయ్యాక కొత్తగా వచ్చిన సీఐ, ఎస్సైలు కొన్ని రోజులకు ఈ విషయాన్ని కనుక్కున్నారు. దీనిపై అప్పట్లోనే ఓ ప్రజాప్రతినిధి, జిల్లా పోలీసు ఉన్నతాధికారి వద్ద పంచాయితీ జరిగినట్లు చెప్పుకుంటున్నారు. బంగారాన్ని సీజ్ చేశాక తాను ఆ బంగారాన్ని స్టేషన్‌లో పనిచేస్తున్న రైటర్‌కు అప్పగించానని, తనకు సంబంధం లేదని సదరు ఎస్సై అప్పట్లో వివరణ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో మాయమైన బంగారం మొత్తాన్ని తిరిగి తీసుకురావాలని రైటర్‌కు సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆ బంగారంతో తనకు సంబంధం లేదని, విచారణ చేయాలని ఆ రైటర్ వివరణ ఇచ్చినట్లు పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నారు. ఆ తర్వాత మరోసారి జరిగిన చర్చల్లో.. మాయమైన బంగారాన్ని ఎస్సై, రైటర్ చెరి సగం తీసుకురావాలంటూ ఉన్నతాధికారులు, ఓ ప్రజాప్రతినిధి ఆదేశించినట్లు సమాచారం. అయినా ఎవరూ బంగారాన్ని అప్పగించలేదు. అయితే సదరు ఎస్సై వైసీపీ నాయకులకు కావాల్సిన వారు కావడంతో తర్వాత ఎవరూ కూడా మాయమైన బంగారం గురించి మాట్లాడలేదు. నాడు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం వెళ్లినా వారు తొక్కిపెట్టే ప్రయత్నాలు చేశారు తప్ప విచారణ చేయడం గానీ, రికవరీ చేయడం గానీ చర్యలు తీసుకోవడం గానీ చేయలేదు. అయితే ఇప్పుడు కొత్తగా వచ్చిన అధికారులు భయపడి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. అయితే ఇప్పుడు కూడా ఇదంతా అత్యంత గోప్యంగా జరుగుతుండం గమనార్హం.

● వాహనాలూ కనిపించడం లేదట

బంగారమే కాదు.. పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలు, వస్తువులు కూడా మాయమైనట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. బంగారం పట్టుబడ్డ కేసులో అత్యంత ఖరీదైన ఓవాచ్, మొబైల్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. ఇప్పుడు అవి కూడా కనిపించడం లేదని తెలుస్తోంది. ఇక కొన్ని కేసులకు సంబంధించి వాహనాలను సీజ్ చేశారు. అయితే కోర్టు ఆదేశాలు లేకుండానే ఆ వాహనాలను ఎలా వదిలేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది. వాటిని వదిలేశారా..? లేక మాయం చేశారా..? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇన్ని అవకతవకలు జరిగినా గడిచిన ఏడాది కాలంగా వెంకటాచలంలో పనిచేసిన పోలీసు అధికారులు ఎందుకు పట్టించుకో లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతు న్నాయి. దీనిపై స్పందించేందుకు వెంకటా చలంలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది భయపడు తుండడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. కాగా ఈ వ్యవహారాలన్నిం టిపై ప్రస్తుత వెంకటాచలం పోలీసు అధికారులు ఉన్నతాధికారులు నివేదించిన నేపథ్యంలో తదుపరి ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది.



వెంకటాచలం పోలీసుస్టేషన్

విద్యుత్ శాఖలో ఏఈఈల కొరత

- 114 మందికిగానూ 77 మందే విధుల్లో..
- ఖాళీగా 37 పోస్టులు
- భర్తీపై గత ప్రభుత్వం అశ్రద్ధ
- కొత్త ప్రభుత్వంలోనూ మారని స్థితి
- నియమకాలు చేపట్టాలంటూ ప్రజల వినతి



జలదంకి, ఆగస్టు 25 : గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతే గిలగిలా కొట్టుకునేలా ఉంది ప్రజల పరిస్థితి. జిల్లాలో అలాంటి ప్రజావసరమైన విద్యుత్ సరఫరా చేసే శాఖలో ప్రధానమైనవి ఏఈఈ పోస్టులే. అయితే వాటి భర్తీ విషయాన్ని పరిశీలిస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. జిల్లాలో మొత్తం 114 ఏఈఈ పోస్టులు ఉండగా, 77 మంది పని చేస్తున్నారు. మిగిలిన 37 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే సిబ్బంది కొరత విద్యుత్‌శాఖలో తీవ్రంగా ఉందని చెప్పుకోవచ్చు. ఉదాహరణకు ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని 8మండలాలకుగానూ 8 ఏఈ ఈ పోస్టులు ఉన్నాయి. ఒక్క వరికుంటపాడు మినహా మిగిలిన ఏడుచోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరిస్థానంలో సబ్‌ఇంజనీర్లను కొన్ని చోట్ల, పక్క ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐదేళ్లుగా వారే విధులు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఖాళీల భర్తీపై శ్రద్ధ చూపలేదు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనూ తీరు మార లేదు. ఏఈఈ పోస్టులు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● మెట్టకు వచ్చేందుకు విముఖత

డెల్టాప్రాంతంలో రొయ్యల చెరువులు, పరిశ్రమలు ఉన్న చోట్ల, ఇతర పట్టణాలు, నెల్లూరు నగరం తదితర ప్రాంతాల్లోనే ట్రాన్స్‌కో ఏఈఈలు పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉదయగిరి లాంటి మెట్ట ప్రాంతంలో ఉద్యోగం చేసేందుకు వారు ఇష్టపడడం లేదు. దీంతో ఈ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో ఏఈఈ పోస్టులు గత ఐదేళ్లుగా లేవు. ఆదాయమార్గాలు మెట్ట ప్రాంతంలో తక్కువగా ఉంటాయని, కేవలం గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులే ఈ ప్రాంతంలో ఉండడంతో ఆదాయమార్గాలు ఉండవనే ఉద్దేశంతో అత్యధికులు ఈ ప్రాంతంలో పోస్టింగులకు ఇష్టపడడంలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందడంలేదు. దీంతో కరెంటుపోతే ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. ఇకనైనా కొత్త ప్రభుత్వంలో తమకు మంచిరోజులు వచ్చేలా ట్రాన్స్‌కో ఏఈఈ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని మెట్ట ప్రాంతవాసులు కోరుతున్నారు.

యథేచ్ఛగా ఆలయ భూమిలో పనులు

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


భూమి చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కంచె

వరికుంటపాడు, ఆగస్టు 25: మండలంలోని వేంపాడు రెవెన్యూలో గల ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన మదన వేణుగోపాల స్వామి ఆలయ భూమిలో ఆక్రమణదారులు రెండు రోజులుగా యథేచ్ఛగా పనులు చేపడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అందులో భాగంగా ఆదివారం యంత్రాలతో భూమిని చదును చేసి చుట్టూరా ఇనుప కంచెను సైతం ఏర్పాటుచేశారు. పామూరుకు చెందిన కొంతమంది సర్వే నంబరు 78-1లోని 6.08 ఎకరాల ఆలయ భూమిని ఆక్రమించుకొని బీనామీ పట్టాలు పొందిన నేపథ్యంలో విచారణ చేపట్టిన జేసీ కోర్టు ఆ భూమి ఆలయానికి సంబంధించినదిగా నిర్ధారించి తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ ఆక్రమణదారులు తమపంతం నెగ్గించుకోవాలనే తలంపుతో ఆ తీర్పును సవాలు చేస్తూ ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తీర్పు వెలువడేంత వరకు ఇరువురికీ ఆ భూమిలోకి ప్రవేశించే అవకాశం లేకుండా 15 రోజుల పాటు గడువు విధిస్తూ హైకోర్టు స్టే మంజూరు చేసింది. అదే ఆసరాగా చేసుకున్న ఆక్రమణదారులు గడువు పూర్తి కాకుండానే నిబంధనలకు విరుద్ధంగా హైకోర్టు తీర్పును సైతం ధిక్కరించి భూమిలోని హెచ్చరిక బోర్డును తొలగించి యంత్రాలతో తమ ఇష్టానుసారంగా పనులు చేపట్టేందుకు పూనుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ తతంగమంతా పూర్తి ఆధారాలతో రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నియంత్రించాల్సిన అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమని ఆలయ ఈవో నరసింహబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న పనులను అడ్డుకోవడంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కోరుతున్నారు.

కావలి కాలువకు నీరు విడుదల


కావలి కాలువలో నీటి ప్రవాహం

సంగం, ఆగస్టు 25: సంగం బ్యారేజీ నుంచి కావలి కాలువకు సంగం సెక్షన్ ఇరిగేషన్ అధికారులు ఆదివారం 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కావలి పట్టణానికి తాగునీటి అవసరాల నిమిత్తం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజుల కిందట సోమశిల జలాశయం నుంచి సంగం బ్యారేజీకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం సోమశిల జలాశయం నుంచి సంగం బ్యారేజీకి 550 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుంది. సంగం బ్యారేజీకి చేరిన నీటిని 350 క్యూసెక్కులు కావలి కాలువకు, 200 క్యూసెక్కులు కనిగిరి రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు.

మూడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం వాహనం

సంగం, ఆగస్టు 25: స్థానిక ముంబై రహదారి కూడలిలో పోలీసులు అర్ధరాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎటువంటి అనుమతి లేకుండా బొలేరా ట్రక్కు వాహనంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల మేరకు.. అర్ధరాత్రి సుమారు 2-30 గంటల సమయంలో కొండవైపు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న బొలేరా ట్రక్కు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 60 బస్తాల రేషన్ బియ్యం (3 టన్నులు) ఉన్నాయి. అందుకు సంబంధించి ఎటువంటి బిల్లులు లేవు. దీంతో బియ్యంతోపాటు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతసాగరం మండలం నుంచి కోవూరులోని ఓ రైస్ మిల్లుకు విచారించగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు తెలిసింది. అక్రమ రేషన్ బియ్యం గురించి పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

పోలీసుల్లో అభద్రతా భావం

- డీఎస్పీనే ఢీకొట్టి వెళ్లిన కారు
- ఇద్దరు సీఐలకు జరగరానిది జరిగిఉంటే ఎవరు బాధ్యులు ?
- ఇంత జరిగినా పట్టించుకోని ఎస్పీ



నెల్లూరు,(క్రైం), ఆగస్టు 25: గంజాయి ముఠా అరాచకాలు జిల్లా పోలీసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నా యి. అండగా నిలవాల్సిన జిల్లా ఎస్పీ కనీసం సంఘటనా స్థలాన్ని పరిశీలించడం, రూరల్ డీఎస్పీని పరామర్శించి, పత్రికలకు వివరాలు తెలియజేయడం వంటివి కూడా చేయ లేదు. ఘటన జరిగి 24 గంటలు అయినా ఎస్పీ కాలయా పన చేయడం అటు పోలీసు అధికారుల్లోనూ, ఇటూ సిబ్బందిలోనూ తెలి యని అభద్రత భావం నెలకొంది. ఈ క్రమంలో పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించే సమయంలో ఎవరి జాగ్ర త్తలు వారు తీసుకుంటే సరిపోతుందని, ఏదైనా జరగరా నిది జరిగితే ఎవరు అండగా నిలుస్తున్నారని కిందిస్థాయి సిబ్బంది అంటున్నారు. ఏ పోలీసును కదిలించినా మాకెందుకే.. మాకు ఇబ్బంది లేకుండా మా ఉద్యోగం మేం చేసుకుంటూ పోతాం... డీఎస్పీలకు, సీఐలకే రక్షణ లేదు. కింది స్థాయి సిబ్బంది అయిన మమ్మల్ని ఎవరి పట్టించుకుం టారులే.. అన్న మాటలే వినిపిస్తున్నాయి. కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లా లో శాంతి భద్రతలు ఘోరంగా మారాయి. ఈ క్రమంలోనే డీఎస్పీ, ఇద్దరు సీఐలపై గంజాయి ముఠా కారును ఎక్కించే ప్రయత్నం చేసిందంటే సామాన్యులకు ఇక రక్షణ ఏముంటుందన్న ప్రచారం సాగుతోంది.

సిబ్బందిపై ప్రభావం

పోలీసులపైనే నేరస్థులు తిరగబడడం, దాడి చేయడం, పోలీసుస్టేషన్లలో మధ్యస్థాలకు ఒకరి నుంచి పది మంది వరకు ఫోన్లు చేయడం... తదితర సంఘటనలు పోలీసు అధికారులు, సిబ్బందిపై ప్రభావం చూపిస్తున్నాయి. ముఖ్యంగా హోంగార్డు స్థాయి నుంచి కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్‌ఐ, సిబ్బందిపైనే కాకుండా చివరకు ఎస్‌ఐ పైన కూడా దాడులు జరుగుతున్నాయన్న వార్తలు జిల్లాలో వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో వారికి అండగా నిలవాల్సిన పోలీసు అసోసియేషన్లు కానీ, ఉన్నతాధికారులు కానీ, ముందుకు రాకపోవడంతో వారు మనస్తాపానికి గురవుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పోలీసుస్టేషన్లలో సామాన్యులకు న్యాయం జరగదు.

గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేస్తాం

- మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాజీ షేక్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 25: గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేస్తామని, రాబోయే ఎన్నికల్లో కార్యకర్తల సంఖ్యా బలాన్ని పెంచే కార్యక్రమాన్ని చేపడుతున్నామని మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాజీ షేక్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్ర మానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మా ట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలలో బీజేపీకి బలం లేదన్న విపక్షాల మాటలను తిప్పికొడుతూ 2024 ఎన్నికల ప్ర యోగం ఏ విధంగా విజయవంత మైందో అందరూ గమనించాలన్నారు. సెప్టెంబరు 1 నుంచి 16వ తేదీ వరకు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని, ఆత్మీయులతో, దేశ అభివృద్ధిని కాంక్షించే వ్యక్తు లతో కలుస్తూ పార్టీ సభ్యత్వం భారీగా జరిగేలా ప్రయత్నం చేస్తామన్నారు. ఈ రాష్ట్రంలో మైనార్టీలతో పాటు సమా జంలో ఉన్న ప్రతి ఒక్కరూ అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, మై నార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బాషా, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాజీ షేక్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6896
వెండి కిలో ధర	రూ. 88,300
వెండి ఒక గ్రాము	రూ. 91.30

నేటి నుంచి క్రీడోత్సవాలు

- వివిధ అంశాల్లో పోటీలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 25: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సోమవారం నుంచి ఈ నెల 29వతేదీ వరకు క్రీడాదినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీన హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. సోమవారం క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, మంగళవారం 18 నుంచి 40 ఏళ్లలోపు క్రీడాకారులకు 100 మీటర్ల పరుగు పోటీ, బ్రిస్క్‌వాక్, వాలీబాల్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలుం టాయన్నారు. అలాగే 40 నుంచి 60 ఏళ్లలోపువారికి 50 మీటర్ల పరుగు పోటీ, 300 మీటర్ల వాక్, టగ్ ఆఫ్ వార్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు, 60 ఏళ్ల పైబడిన వారికి 50 మీటర్ల వాక్, యోగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 28వతేదీన రన్నింగ్, వాకింగ్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు, బ్యాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, ఇండోర్ గేమ్స్‌ను, లెమన్ రేస్, రోప్‌జంప్, ఖోఖో, లగోరి అండ్ లంగాడి, ప్లాంక్ చాలెంజ్ వంటి ఫన్నీ గేమ్స్ ఉంటాయన్నారు. 29వతేదీన ఉదయం 8 గంటలకు ఏసీ స్టేడియం నుంచి కరెంట్ ఆఫీస్ సెంటర్ మీదుగా తిరిగి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను సన్మానిస్తామని తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులందరూ ఆయా తేదీల్లో స్టేడియంలో ఉదయం 8 గంటలకు హాజరై పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు డీఎస్‌ఏ జూనియర్ అసిస్టెంట్ ఎస్ వెంకట్రావు(8886228444)ను సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జా!

రాత్రికి రాత్రే దున్ని నాటిన నిమ్మ మొక్కలు


ప్రభుత్వ భూమిలో నాటిన నిమ్మ మొక్కలు

కలువాయి, ఆగస్టు 25 : కొందరు భూబకాసురులు దర్జాగా ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. రాత్రికి రాత్రే దున్ని నిమ్మ మొక్కలు నాటారు. ఈ సంఘటన కలువాయి మండలం మాదన్నగారిపల్లెలో జరిగింది. గ్రామస్థుల సమాచారం మేరకు... మాదన్నగారిపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 213, 314లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిపై కన్నేసిన ఐదుగురు వ్యక్తులు రాత్రికి రాత్రే భూమిని దున్ని నిమ్మ చెట్లు వేసి ఆక్రమించేశారు. ఇది ప్రభుత్వ భూమి అని గతంలో రెవెన్యూ అధికారులు ఇక్కడ బోర్డు కూడా పెట్టించారు. అయినా లెక్క చేయకుండా భూమిని ఆక్రమించి నిమ్మ చెట్లు వేశారని గ్రామస్థులు తెలిపారు. దీనిపై ఆదివారం ఆత్మకూరు ఆర్డీవోకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ విషయం నా దృష్టికి వచ్చిందిని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ భూమిలో వేసిన నిమ్మ మొక్కలు తీయించి వేస్తామని వీఆర్వో జనార్దన్ తెలిపారు.

జీవో ప్రకారమే బదిలీలు: డీఎఫ్‌వో చంద్రశేఖర్


అటవీశాఖ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో చంద్రశేఖర్

నెల్లూరు (వెంకటేశ్వ రపురం), ఆగస్టు 25 : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారమే అటవీశాఖలో బదిలీలు ఉంటాయని జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. నెల్లూరులోని ఆయన ఆదివారం జూనియర్ ఫారెస్ట్ అఫీసర్స్ అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహిం చారు. ఐదేళ్లుగా ఒకే స్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులతోపాటు అనేక నిబంధనలతో బదిలీలకు ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ క్రమంలో జిల్లా స్థాయిలో ఒక కమిటీని నియమించి బదిలీల ప్రక్రియ నిర్వహించాలని అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా బదిలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమవేశంలో అసోసియేషన్ నాయకులు పిచ్చిరెడ్డి, రవిశేఖర్, రవీంద్రబాబు, మల్లికార్జున, వెంటకటేశ్వర్లు, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'తుమ్మలపెంట' అభివృద్ధి చెందేనా?

- బీచ్‌లో పర్యాటకులకు వసతులు నిల్
- రహదారి సౌకర్యం అధ్వానం
- రిసార్ట్స్‌కే పరిమితమైన పర్యాటకాభివృద్ధి

తుమ్మలపెంట బీచ్



కావలిటౌన్, ఆగస్టు 25 : తుమ్మలపెంట బీచ్‌లో ఆహ్లాదం.. ఆనందం.. నేతల ప్రకటనలకే పరిమితమయ్యాయి. పర్యాటకులకు సరైన వసతులు లేవు. అక్కడికి వెళ్లే రహదారి అడుగడుగున గుంతలతో అధ్వానంగా ఉంది. కనీసం నిలువ నీడ లేదంటే నమ్మ శక్యం కాదు. కేవలం రిసార్ట్స్‌కే పరిమితమైంది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో తీరప్రాంతంలోని బీచ్‌లలో పార్కులు, పచ్చని చెట్లు, పర్యాటకులు సేద తీరేందుకు షెల్టర్లు తదితర వసతులు కల్పిస్తామన్న ప్రజాప్రతినిధులు, అధికారుల హామీలు ఆచరణకు నోచలేదు. దీంతో తుమ్మలపెంట బీచ్‌లో అభివృద్ధి మచ్చుకైనా కనిపించక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

నిలువనీడ లేదు

పేదలు, మధ్య తరగతి ప్రజలు రిసార్ట్స్‌లో రూమ్‌లు తీసుకునే ఆర్థిక స్థోమతలేకపోవడంతో సేద తీరేందుకు నిలువ నీడలేక బీచ్ వద్దకు వచ్చే పర్యాటకులు ఎండలోనే ఉండాల్సిన దుస్థితి. గత 15 ఏళ్ల నుంచి తుమ్మలపెంట బీచ్‌ను అభివృద్ధి చేస్తామని, పర్యాటకులకు వసతులు కల్పిస్తామన్న హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. పార్కు నిర్మాణం, స్నానం గదులు తదితర సౌకర్యాలు లేవు.

రిసార్ట్స్‌కే పరిమితమైన పర్యాటకాభివృద్ధి

కావలి తుమ్మలపెంట బీచ్ వద్ద ఏపీ టూరిజం శాఖ రిసార్ట్స్ నిర్మించారు. ఏసీ, నాన్ ఏసీ రూమ్‌లు, హోటల్‌ను అందుబాటులోకి తెచ్చారు. అయితే ఏసీ రూమ్ రూ.2000, నాన్ ఏసీ రూమ్ రూ.1700 ధర నిర్ణయించారు. హోటల్‌లో ఫుడ్ ధరలు కూడా ఎక్కువ కావడంతో సామాన్యులు లోపలకెళ్లేందుకు సాహసం చేయలేని పరిస్థితి. అలాగే మద్యం ప్రియుల కోసం బార్ కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఈ బీచ్ ధనికులకే పరిమితమైందన్నట్లు తయారైంది.

బీచ్ రోడ్డు అధ్వానం

తుమ్మలపెంట బీచ్ రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణానికి పర్యాటకులు భయాందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి సెప్టెంబరు 1న తుమ్మలపెంట బీచ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించడంతో రోడ్డు నిర్మాణంతోనైనా తుమ్మలపెంట బీచ్‌కు మహర్దశ పడుతుందా అని చర్చించుకుంటున్నారు. రోడ్డుతో పాటు బీచ్ వద్ద పర్యాటకుల కోసం సౌకర్యాలు కూడా కల్పిస్తామన్న ఎమ్మెల్యే హామీ అయినా నెరవేరి పర్యాటకులకు వసతులు ఏర్పడాతాయా?. ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బీచ్‌లు అందుబాటులో లేకపోవడంతో తిరుపతి దైవ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో బీచ్ కెళ్లాలన్న అభిలాష ఉన్నవారు హైవే నుంచి తుమ్మలపెంట కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఈ బీచ్‌ను సందర్శిస్తుంటారు. ఇక్కడ వసతులు లేకపోవడంతో పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ఈ బీచ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

సోమశిలలో 30.846 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 16.352 క్యూసెక్కులు నీరు వస్తోంది. దీంతో ప్రాజెక్టులో ప్రస్తుతం 30.846 టీఎంసీల నీరు నిల్వ చేరింది. దిగువ కండలేరుకు 2000, డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి : బీటీఏ

నెల్లూరు (విద్య), ఆగస్టు 25 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని బీటీఏ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మణిసుబ్బు, మాసా ప్రసాద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గడిచిన దశాబ్దకాలం నుంచి దేశవ్యాప్తంగా ఓపీఎస్ పునరుద్ధరణకు ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఐదురాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని యూపీఎస్ పథకాన్ని తీసుకురావడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక్కరోజు పదవిలో ఉన్నా ఎలాగైతే పెన్షన్ వర్తిస్తుందో, అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూడా పాత పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడిపై ఫిర్యాదు

కావలి రూరల్, ఆగస్టు 25: కావలి పట్టణం ట్రంక్ రోడ్డులోని ఐదులాంతర్ల సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని బాధితుడు కనపర్తి మమేష్ ఆదివారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు... కావలి మండలం పువ్వలదొరువుకు చెందిన మహేష్ స్నేహితులతో కలసి ఐదులాంతర్ల సెంటర్‌లో రూం అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఓ వివాహానికి మంగళమేళం వాయించి వచ్చిన అతనిపై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తీవ్రగాయాలైన అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ జమాల్‌వలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 25: పోలీసు శాఖకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్) ను ఈ సోమవారం రద్దు చేసినట్లు ఎస్పీ జీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం లేదని తెలియజేశారు.

గంజాయి కేసును ఛేదించిన పోలీసులు

- స్మగ్లరు అరెస్టు
- 74 కేజీల సరుకు స్వాధీనం


అరెస్టు చేసిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, తదితరులు

నెల్లూరు,(క్రైం): గంజాయి ముఠా కేసును ఛేదించినట్లు నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం మనుబోలు పోలీసుస్టేషన్‌లో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఆ సమావేశానికి విలేకరులను ఎవరినీ ఆహ్వానించలేదు. ఎస్పీ కార్యాలయం నుంచి మాత్రం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలోని వివరాల మేరకు, శుక్రవారం రాత్రి నైట్ మానటరింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు వైపు నుంచి ఏపీ 39 డీజే 1000 నెంబరు గల కారును ఆపి తనిఖీ చేసేందు కు ప్రయత్నంచారు. కారులో ఉన్న వ్యక్తులు కారును ఆపినట్లుగా ఆపి ఒక్కసారిగా పోలీసులపై దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తప్పించుకునే సమయంలో రూరల్ డీఎస్పీకి కారు తగిలి కింద పడిపోయారు. దీంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయి. కారులో ఉన్నవ్యక్తులు పరారయ్యారు. ఈ ఘటనపై వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. కేసులో దర్యాప్తులో భాగంగా పొదలకూరు, వెంకటాచలం, కోవూరు సీఐలను, టీంలుగా ఏర్పాటు చేశారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.ఈ క్రమంలో మనుబోలు మండలం వీరంపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో గంజాయిని దాచి పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. పరారైన నిందితుడు అర్జి సత్య నారాయణ ఉరఫ్ సతీష్‌ను అరెస్టు చేసి, అతని కారులో ఉన్న 74 కేజీల గంజాయి ప్యాకెట్లను, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో నిందితుడిని విచారించగా, మరి కొంత మంది నిందితులతో కలిసి విశాఖ ఏజెన్సీలో గంజాయిని కొనుగోలు చేసి దాన్ని తిరుపతిలో ఎక్కువ ధరకు అమ్మేందుకు కారులో వెళుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద తమను పట్టుకోవడానికి ప్రయత్నించిన పోలీసులను కారుతో ఢీకొట్టి వెళ్లిపోయినట్లు తెలిపాడు. కాగా కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినంచారు.

పొంతన లేని వివరాలు

అయితే పోలీసులు తెలిపిన వివరాలు ఎన్నో అనుమానాలను కలిగిస్తున్నాయి. నిందితుడిని కారును వెంటాడి కోనసముద్రం దాటిన తరువాత పట్టుకున్నట్లు సోషల్ మీడియా, పత్రికల్లో కథనాలు వచ్చాయి. అయితే మనుబోలులో నిందితుడిని అరెస్టు చేశామని పోలీసులు చెప్పడం ఏమిటి ? డీఎస్పీని ఢీకొట్టిన తరువాత పర్యటించిన ప్రాంతాలన్నింటిలో పోలీసులు ఎక్కడైనా కేసు నమోదు చేసి అరెస్టు చేయవచ్చని, అలా ఎందుకు జరగలేదనే ప్రశ్న ఉదయిస్తున్నది. అయితే అప్పటికే పోలీసులు వెంకటాచలంలో కేసు నమోదు చేశామని ఓ ప్రకటనలో తెలిపారు. అయితే మనుబోలులో అరెస్టు చేశామని చూపించడం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతున్నది.అయితే ఈ కేసు వివరాలను జిల్లా ఉన్నతాధికారులు కాకుండా డీఎస్పీ స్థాయి అధికారుల ద్వారా విలేకర్లను పిలవకుండా పత్రికా ప్రకటన విడుదల చేయడం అందరిలోనూ అనుమానాలకు తావిస్తున్నది.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో మాదిగ ఉద్యోగులు, మేధావులు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు(హరనాథపుం), ఆగస్టు 25 : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను రాష్ట్రం లో తక్షణమే అమలు చేయాలని మాదిగ ఉద్యోగులు, మేధావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. ఆదివారం నెల్లూరులోని డాక్టర్ జగ్జీవన్‌రామ్ భవన్‌లో వర్గీకరణ పరిరక్షణ కమిటీ జేఏసీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ, ఎస్సీఎస్టీ రాష్ట్ర కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవీంద్ర, డాక్టర్ కలివెల ఎలీషా కుమార్, ఎస్సీ, ఎస్టీ బీసీ, ముస్లిం మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, జాతీయ ఉపాధ్యక్షుడు విజయ కుమార్ వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. రాష్ట్రాల పరిధిలో ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పునిచ్చిందన్నారు. పొరుగున ఉన్న తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా స్పందించారన్నారు. కానీ, రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు నేటి వరకు ఎలాంటి హామీ ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని ఎస్సీ వర్గీకరణ చేస్తామనటం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలు వాస్తవాలను దాచి పెట్టి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారని, అంతమాత్రాన నిజం అబద్ధం కాబోదన్నారు. ఎస్సీలు అంటే కేవలం మాలలు, మదిగలే కాదని మరో 57 ఉపకులాలు ఉన్నాయని, వారందరికీ సామాజిక న్యాయం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, అంకి మనోజ్‌కుమార్, ఎస్ రత్నయ్య, విశ్రాంత తహసీల్దారు జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ టీ-20 క్రికెట్ విజేత గుంటూరు


చాంపియన్‌గా నిలిచిన గుంటూరు జట్టు

నెల్లూరు (విద్య), ఆగస్టు 25 : నెల్లూరులోని సీఏఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వెటరన్ టీ-20 క్రికెట్ పోటీల్లో గుంటూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. సీనియర్ క్రీడాకారుడు తాటిపర్తి సునీల్‌కుమార్ స్మృత్యర్థం వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులు సాధించింది. ఎం రాజాకృష్ణ 98 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసి విజేతగా నిలిచింది. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు పీ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యుత్‌లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి

రాపూరు, ఆగస్టు 25 : రాపూరులో విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న గోమసాని పెంచలయ్యయాదవ్ శనివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల మేరకు.. మండలంలోని తెగచెర్లలో ఇంటి వద్ద మోటారు స్విచ్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందా డు. పెంచలయ్య మృతితో తెగచర్లలో, రాపూరు విద్యుత్ శాఖలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వివాహ ఖర్చులకు ఆర్థికసాయం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 25: పట్టణంలోని దళితవాడకు చెందిన ఈర్ల చిన్నమ్మి కుమార్తె నాగమణి వివాహం సందర్భంగా ఖర్చుల నిమిత్తం మన ఫౌండేషన్ అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ఆదివారం రూ. 5వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో మన ఫౌండేషన్ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా, రైతు సమస్యలను విస్మరించారు : సీపీఎం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న గుజ్జుల మల్లికార్జున

ఉదయగిరి రూరల్, ఆగస్టు 25: ప్రస్తుత ప్రభుత్వాలు ప్రజా, రైతు సమస్యలను పూర్తిగా విస్మరించాయని సీపీఎం నాయకులు షేక్ ఫరుద్దీన్‌బాషా, గుజ్జుల మల్లికార్జున్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలకు భిన్నంగా ప్రజలు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను నిర్మించేందుకు సీపీఎం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య, సీపీఎం, సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, బయ్యన్న, గడ్డం నాగేశ్వరరావు, తిరుపతయ్య, నాయబ్ రసూల్, చిన్నఫరుద్దీన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పూజలు

సంగం, ఆగస్టు 25: మండలంలోని కోలగట్లలో వెలసి ఉన్న పురాతన నాగారపమ్మదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జీవించడం అంటే ఒక కళ

ఆత్మకూరు, ఆగస్టు 25 : జీవించడం మంటే ఒక కళ అని వెలిశెట్టి నారాయణరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని గ్రంథాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మంచిమాట కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా తెలుగు భారతి సేవా సమితి కార్యవర్గ సభ్యులు కటారి సుధాకర్ రాధాకృష్ణుల విగ్రహాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, తెలుగు భారతి సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి, ప్రచార కార్యదర్శి కలిశెట్టి రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 25: స్థానిక దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో సోమవారం నుంచి శనివారం వరకు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మండపం వద్ద స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం, భగవద్గీత పఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. మంగళవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు స్వామివారి ఊరేగింపు, భగవద్గీత శ్లోకాల పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు, 30న భగవద్గీత శ్లోకాల రాత పోటీలు ఉంటాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

వింజమూరు, ఆగస్టు 25 : మండలంలోని చాకలకొండ గ్రామంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధికి అంజనాద్రి పీఠం చైర్మన్ జక్కం శ్రీనివాసులురెడ్డి, శ్రీకృష్ణ జనార్ధన అనంతస్వామి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆలయ కమిటీని త్వరలో నియామకం చేస్తామన్నారు. ఈ కమిటీలో అన్ని వర్గాల వారికి అవకాశం కల్పిస్తామని, సేవాభావం కలిగిన వారు కమిటీలో చేరవచ్చని తెలియజేశారు. భక్తులు, గ్రామస్థులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

గంగమ్మకు కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సంగం, ఆగస్టు 25: స్థానిక పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న గంగమ్మకు శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో కుంకుమార్చన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహిళలను లక్షాధికారులు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

లింగసముద్రం, ఆగస్టు 25 : పొదుపు మహిళలను లక్షాధికారులు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని వెలుగు ఏపీఎం కె సింహాద్రిరావు చెప్పారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లఖ్‌పతి దీదీ అవగాహన లైవ్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహిళలను ఉద్దేశించి ప్రసంగించిన వీడియోను ప్రదర్శించారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు నారాయణమ్మ, మాధవ, మాధవరావు టీడీపీ నాయకులు పీ బాలకోటయ్య, కిలారి కొండయ్య, మద్దెల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కావలి మండల సమావేశం

కావలి రూరల్, ఆగస్టు 25: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్పీడీవో శ్రీధర్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎమ్పీటీసీలు, కోఆప్షన్ సభ్యుడితో పాటు సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

జీతాలు అందక ఆయాల ఆకలి కేకలు



ఎస్ఆర్‌పురం హైస్కూల్‌లో మరుగుదొడ్లు శుభ్రపరుస్తున్న ఆయా

సీతారామపురం, ఆగస్టు 25: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్‌లకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీతాలు అందకపోవడంతో పూట గడవక అవస్థలు పడుతున్నారు. మండలంలో 46 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, కస్తూర్బా, ఏపీ మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 47 మంది ఆయాలు, ఆరుగురు వాచ్‌మెన్‌లు పని చేస్తున్నారు. జీతాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని, అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జీతాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈఓ మస్తాన్‌వలిని వివరణ కోరగా ఆయాలు, వాచ్‌మెన్‌ల పెండింగ్ జీతాలు ఆన్‌లైన్ చేయడం జరిగిందని, త్వరలోనే వారి ఖాతాలో జమవుతాయని తెలిపారు.

గుండాల హనుమాన్‌రెడ్డి మృతికి మంత్రి ఆనం సంతాపం



నివాళులర్పిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 25 : ఆత్మకూరు మాజీ సర్పంచు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గుండాల హనుమాన్‌రెడ్డి మృతికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంతాపం తెలిపారు. ఆదివారం ఆయన ఆత్మకూరు పట్టణంలోని హనుమాన్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. హనుమాన్‌రెడ్డి కుమారుడు, మెడికవర్ ఆసుపత్రి ఎండీ గుండాల అనిల్‌కృష్ణారెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరెడ్డి, ఊరిమిండి వెంకటేశ్వర్లురెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, కౌన్సిలర్ నూరా భాస్కర్‌రెడ్డి, నూరా శ్రీనివాసులరెడ్డి, నూరా శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం



సీఆర్పీలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఏపీఎం ఖాజారంతుల్లా

ఉదయగిరి రూరల్, ఆగస్టు 25: పొదుపు సంఘాల్లో మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లఖ్‌పత్ దీదీ పథకాన్ని ప్రవేశపెట్టిందని వెలుగు ఏపీఎం సయ్యద్ ఖాజారంతుల్లా పేర్కొన్నారు. ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మహారాష్ట్రలో లఖ్‌పత్ దీదీ పథకాన్ని ప్రారంభించడంతో స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సమైఖ్య ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 8,800 మంది పొదుపు మహిళలు ఉండగా లఖ్‌పత్ దీదీ పథకం కింద తొలి విడతగా 1,750 మందిని ఎంపిక చేశామన్నారు. వీరికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరుచేయడం జరుగుతుందన్నారు. అనంతరం సీఆర్పీలు, మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు సువార్తమ్మ, కోశాధికారి చంద్రకళ, సీసీలు, ఈవోఏలు తదితరులు పాల్గొన్నారు.

లక్‌పతి దీదీలకు సర్టిఫికెట్ల పంపిణీ

సంగం, ఆగస్టు 25: స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం 217 మంది పొదుపు మహిళలకు లక్‌పతి దీదీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన పొదుపు మహిళలు లఖ్‌పతి దీదీలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని టీవీలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతమ్మ, సర్పంచు రమణమ్మ, టీడీపీ నాయకులు గుండ్లపల్లి, శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు, ఏపీఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



అనంతసాగరం: చెక్కు అందజేస్తున్న అధికారులు

అనంతసాగరం : స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన లఖ్‌పత్ దీదీ యోజన కార్యక్రమంలో భాగంగా పలువురు పొదుపు సభ్యులకు వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు మునగపాటి సునీత, ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ, ఏపీఎం రమణారావు, మండల నాయకులు చల్లా శివారెడ్డి పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలు

మర్రిపాడు : స్థానిక వెలుగు కార్యాలయంలో లఖ్ పతి దీదీ యోజన పథకంకు సంబంధించి జరిగిన సమావేశంలో పొదుపు సంఘాల్లోని 175 మంది సభ్యులకు వడ్డీలేని రుణంగా రూ.5.50 కోట్ల చెక్కు అందిచారు. కార్యక్రమంలో ఏపీఎం బుజ్జమ్మ, టీడీపీ మండలధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, నాయకులు శాఖమూరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో రోగాలు దూరం

- సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉయ్యూరు శోభ



ఆత్మకూరు : మాట్లాడుతున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ శోభ

ఆత్మకూరు, ఆగస్టు 25 : ధ్యాన సాధనతో రోగాలు దూరమవుతాయని, మనిషిలో ప్రశాంతత పెరిగేకొద్దీ అతని విజయాలు, శక్తిసామర్థ్యాలు పెరుగుతాయని సీనియర్ పిరమిడ్ మాస్టర్, ఐటి అధికారి ఉయ్యూరు శోభ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండుకు ఎదురుగా ఉన్న శ్రీషిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో ఆదివారం ధ్యాన-జ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతు జీవిత లక్ష్యాలు, నమ్మకాలు, ఆలోచనలు, సంకల్పాలు తదితర అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ చంద్రా సుబ్రమణ్యం, చంద్రా విజయ, మూరం వెంకటేశ్వర్లురెడ్డి, పలువురు ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

శాకాహారంపై పిరమిడ్ సద్భావనా యాత్ర



సంగం : ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు

సంగం : పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో సంగంలో శాకాహారంపై సద్భావనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక వెంకయ్యస్వామి ఆలయం నుంచి రాజరాజేశ్వరాలయం పీఠధిపతి రాజేశ్వరానందస్వామి ప్రారంభించారు. జాతీయరహదారి కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతితో సహజీవనం ఆరోగ్యానికి రక్ష

వింజమూరు, ఆగస్టు 25 : ప్రకృతితో సహజీవనం ఆరోగ్యానికి రక్ష అని విజయవాడ సీనియర్ పిరమిడ్ మాస్టర్ బి సాంబశివరావు అన్నారు. ఆదివారం వింజమూరులో వేదవ్యాసా వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ధ్యాన సాధన అందించారు. శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుల్లత, హేమలత, రాజేశ్వరి, సుప్రజా, స్వరాజ్యం, పార్వతి, కృష్ణవేణి, ధ్యానులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

- స్థలంలో భారీగా పెరిగిన చిల్లచెట్లు
- ఆచరణకు నోచని కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాలు
- రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద కరువైన ఆహ్లాదం



రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద గుడి, పార్కు స్థలంలో పెరిగిన చిల్లచెట్లు

కలగా మిగిలిన గుడి, పార్కు నిర్మాణం!

లింగసముద్రం, ఆగస్టు 25 : రాళ్లపాడు ప్రాజెక్టు సందర్శకులకు మరింత ఆహ్లాదం కలిగించేందుకు ఆ ప్రాంతంలో దేవస్థానంతోపాటు, పార్కు నిర్మించాలన్న కల నెరవేరలేదు. దీంతో అందుకు కేటాయించిన స్థలంలో చిల్లచెట్లు భారీగా పెరిగి అడవిని తలపిస్తోంది. వివరాల మేరకు.. మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టును 2009లో అప్పటి ప్రకాశం జిల్లా కలెక్టర్ దేవానంద్ సందర్శించారు. ప్రాజెక్టు పాత, కొత్త గైడ్ బ్యాంకుల మధ్య ఖాళీగా ఉన్న స్థలాన్ని గుర్తించి గుడి, పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు ప్రభుత్వాని ప్రతిపాదనలు పంపారా లేదో తెలియదు కానీ అది కార్యరూపం దాల్చలేదు. అలాగే గతంలో అప్పటి కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సైతం ఇక్కడ భారీ అంజనేయ స్వామి విగ్రహం ఏర్పాలుతో పాటు పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అది కూడా నేటికీ ఆచరణకు నోచుకోలేదు. కాగా రాళ్లపాడు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చే టప్పుడు, ప్రాజెక్టు పూర్తిగా నిండిన సమయంలో ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రాజెక్టును సందర్శించి ఇక్కడ సందడి చేస్తుంటారు. ఇక్కడి చల్లటి వాతావరణానికి సేద తీరుతుంటారు. అలాగే అన్ని వేళలా అడపాదడపా వచ్చే సందర్శకులతోపాటు వలేటివారిపాలెం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాలకొండకు వెళ్లే భక్తులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తూ ప్రాజెక్టును సందర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడ గుడి, పార్కు నిర్మాణం జరిగితే ఈ ప్రాజెక్టు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు ఆయకట్టు రైతులు, ప్రజలు కోరుతున్నారు.

వ్యాపారులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 25: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చారని, ఈ ప్రాంత వ్యాపారులకు తాను అండగా ఉంటానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఓ కల్యాణ మండపంలో జరిగిన ది కావలి కిరాణామర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా అసోసియేషన్ అధ్యక్షుడు బలసా ప్రసాద్‌తో పాటు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్యవర్గాన్ని ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. అలాగే ఎమ్మెల్యేను వ్యాపారులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కావలిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, రానున్న ఐదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది రూపురేఖలు మారబోతున్నాయన్నారు. కావలిని గొప్పనగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ క్రిషోర్ బాబు, బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, పోతుగంటి అలేఖ్య, పోతుగంటి శ్రీకాంత్, ఆర్యవైశ్యసంఘం కావలి మండల అధ్యక్షుడు తటవర్తి రమేష్, తిరువీధి ప్రసాద్, జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్, పలువురు కిరాణామర్చంట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీల అభివృద్ధి

- ఎమ్మెల్యే ఇంటూరిని సన్మానించిన శాలివాహన సంఘం నేతలు



ఎమ్మెల్యే ఇంటూరిని సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు, ఆగస్టు 25: రాష్ట్రంలో బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పాటుపడింది తెలుగుదేశం పార్టీ అని, బీసీలు సైతం పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని జనార్దన స్వామి కళ్యాణ మండపంలో ఏపీ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శాలివాహనసంఘం రాష్ట్రనాయకులు, నియోజకవర్గంలోని వివిధప్రాంతాలలో ఉన్న కుమ్మరులు అధికసంఖ్యలో హాజరై నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి ముందు బీసీలకు రాజకీయాల్లో ప్రవేశం నామమాత్రంగా ఉండేదని, వారిని పెద్దసంఖ్యలో చట్టసభలకు ఎన్నికయ్యేలా చూడటంతో పాటు స్థానికసంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి ఎన్టీఆర్ ఎంతో ప్రోత్సహించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన జగన్ ఒక్కరూపాయి కూడా ఖర్చుచేయలేదన్నారు. కార్యక్రమంలో ఏపీ శాలివాహనసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కరశ్రీనివాస్, స్థానిక నాయకులు అద్దంకి సుబ్బారావు, కరేటి రామరాఘవులు, కలికివాయి మాల్యాద్రి, కలికివాయి కృష్ణ, ఆముదాలపల్లి మాల్యాద్రి, అద్దంకి మాల్యాద్రి, చీర్లదిన్నె మాల్యాద్రి, ముసిలిమడుగు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

కావలిటౌన్, ఆగస్టు 25: అందరూ 60 ఏళ్ల పైబడి షష్టిపూర్తి చేసుకున్నవారే. వయసును మరిచి ఆటపాటలతో ఉల్లాసంగా జరిగిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక పాతరోజుల స్నేహ బంధాన్ని గుర్తు చేసింది. ఆదివారం పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1978-79 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సరస్వతీ పూజతో కార్యక్రమం ప్రారంభించిన అనంతరం పూర్వ విద్యార్థులైన డాక్టర్ శ్రీరామ్ మనోహర్, కిషోర్, ఖదీర్‌లు తదితరులు చదువు చెప్పిన గురువులు సూర్యప్రకాష్‌రావు, బాలసుబ్రమణ్యం, పుల్లయ్యలను ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. పూర్వ విద్యార్థులైన ఏపీ జీఎస్టీ బోర్డ్ కమిటీ సభ్యుడు అమరా సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు సందేశాన్ని చరవాణి ద్వారా వినిపించారు. పసుపులేటి బాబురావు, నారాయణల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.

భూ బాధితులకు అండగా ఉంటాం

- 28న విజయవాడలో జరిగే సదస్సుకు తరలిరావాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య

కావలి, ఆగస్టు 25: గత ప్రభుత్వంలో పేదల భూములను వైసీపీ నాయకులు బలవంతంగా లాక్కొన్నారని, ఆ బాధితులకు అండగా ఉంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు లాక్కొన్న పేదల భూములను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తిరిగి వారికి ఇప్పించేందుకు ఈ నెల 28న విజయవాడలోని దాసరి నాగభూషణం భవనంలో రాష్ట్రస్థాయి సదస్సు జరుగుతోందని, ఆ సదస్సుకు భూ బాధితులు అంతా హాజరు కావాలని పిలుపు నిచ్చారు. కావలిలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పేదల భూములను తీసుకుని లేఅవుట్లలో కలుపుకుని విక్రయించి వారికి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మద్దూరుపాడు వద్ద మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి బంధువులు కూడా పేదల స్థలాలు ఆక్రమించి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అలాంటి బాధితులంతా విజయవాడ సదస్సుకు వచ్చి తమ సమస్యలను తెలుపుకుంటే వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సీపీఐ తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయకార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గా బాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోసు, నేతలు చేవూరు కొండయ్య , నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు



పొంగళ్లతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొండాపురం, ఆగస్టు 24: మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెం, వెల్లటూరివారిపాలెం, ఇస్కపాలెం గ్రామాల ప్రజలు సంయుక్తంగా వెల్లటూరివారిపాలెంలో నిర్మించుకున్న పోలేరమ్మ గుడి వద్ద ఆదివారం పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగు ఆదివారాలుగా అమ్మవారికి చద్ది నైవేద్యాన్ని సమర్పించారు. ఐదవ వారం మూడు గ్రామాల మహిళలు అమ్మవారికి చద్దితోపాటు పొంగళ్లపెట్టి నైవేద్యం సమర్పించారు.

'సోలార్ ఘర్'కు బడేవారిపాలెం ఎంపిక

వలేటివారిపాలెం, ఆగస్టు 25 : కోటి గృహాలకు సోలార్ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సోలార్ ఘర్ స్కీం కింద కందుకూరు నియోజకవర్గంలో మండలంలోని బడేవారిపాలెం గ్రామం ఎంపికైంది. దీంతో ఈ గ్రామంలో నివాసాలకు సోలార్ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు లబ్ధిదారుల ఎంపికకు విద్యుత్ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఆదివారం వలేటివారిపాలెం విద్యుత్ ఏఈ తాటికొండ మధుబాబు నేరుగా గృహస్థుల వద్దకు వెళ్లి ఈ పథకంపై అవగాహన కల్పిస్తూ ఆన్‌లైన్ దరఖాస్తు చేయించారు. ఈ గ్రామం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వగ్రామం కావడంతో ముందుగా విద్యుత్ అధికారులు ఆయన నివాసానికి వెళ్లి ఎమ్మెల్యేకి పథకం విధివిధానాలు వివరించి ఆయతోనే ఆన్‌లైన్ దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తన స్వగ్రామం సోలార్ ఘర్ స్కీం కింద ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో విద్యుత్ వినియోగదారులు సోలార్ గర్ స్కీం కింద తమ గృహాలను రిజిస్ట్రేషన్ చయించుకొని విద్యుత్ అధికారులకు సహకరించాలని సూచించారు.

ఎస్ఐ లతీఫున్నీసా బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ లతీఫున్నీసా

జలదంకి, ఆగస్టు 25: జలదంకి ఎస్ఐ ఆదిలక్ష్మి విఆర్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో నియమితులైన సయ్యద్ లతీఫున్నీసా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నగరం చిన్నబజారు పీఎస్‌లో ఎస్ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యి బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

తెలుగు యువత నేత దాతృత్వంతో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు

కావలి రూరల్, ఆగస్టు 25: కావలి మండలం కొత్తపల్లికి చెందిన తెలుగు యువత నాయకుడు పొన్నగంటి రవీంద్రనాథ్ స్వగ్రామంలో బస్‌షెల్టర్ నుంచి హైస్కూల్ వరకు రూ.25,000 సొంత నిధులను వెచ్చించి ఆదివారం ఎల్ఈడీ లైట్లు వేయించారు.

అధికారులను నిలదీయండి

కావలిటౌన్, ఆగస్టు 25: ప్రజాపక్షం వహించి సమస్యల పరిష్కారం కోసం అధికారులను నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆర్ఎస్ఎఆర్ కల్యాణమండపంలో నియోజకవర్గ పరిధిలోని వైసీపీకి చెందిన సర్పంచులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎమ్పీటీసీల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అధికారం కోల్పోయిందని అధైర్యపడవద్దని ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో చెప్పిన అబద్ధాలు నమ్మి ప్రజలు మోసపోయారన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, ఆగస్టు 25: కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణంకు ఒంగోలుకు చెందిన ముక్తినూతలపాటి వెంకటేశ్వరరావు, లావణ్యలక్ష్మి దంపతులు ఆదివారం రూ.69,120 విరాళం అందజేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారికి మొక్కుకున్నాక నా కుమారుడికి మంచి ఉద్యోగం వచ్చిందని, అందుకే మొదటి నెల జీతం అమ్మవారి మండప నిర్మాణానికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకుని వచ్చామని తెలిపారు. కార్యక్రమంలో వారి కుమారులు అరుణ్‌వశిష్ఠ, అనుదీప్, ఆలయ కమిటీసభ్యులు ఆవుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు శెట్టిపల్లి అక్షిత ఎంపిక



శెట్టిపల్లి అక్షిత

కావలిటౌన్, ఆగస్టు 25: ప్రభుత్వ పాఠశాలలో చదివి పేద కుటుంబానికి చెందిన శెట్టిపల్లి అక్షిత ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సైనిక్ స్కూల్‌కు ఎంపికైంది. ఆదివారం పట్టణ జనతాపేటలోని ప్రజ్ఞా కోచింగ్ సెంటర్‌లో కరస్పాండెంట్ దొడ్డవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అక్షితను పలువురు అభినందించారు. అక్షిత జనతాపేటలోని ఆంధ్రకేసరి మున్సిపల్ పాఠశాలలో 5వ తరగతి చదివి ఒట్టూరు మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో సీటు సాధించింది. ఇటీవల జరిగిన ఏఐఎస్ఎస్ఈఈ (2024) ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంవిద్ బాలికా సైనిక్ స్కూల్‌లో 6వ తరగతిలో సీటు సాధించింది.

6 విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు

కందుకూరు, ఆగస్టు 25: కందుకూరు నియోజకవర్గంలో లో ఓల్టేజీ సమస్య నివారణకు 6 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ప్రతిపాదనలు పంపించగా తొలివిడతగా రెండు సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. వీటిని కందుకూరు మండలం పలుకూరు, ఉలవపాడు మండలం మన్నేటికోటలలో ఏర్పాటు చేయనున్నారు. అలాగే వలేటివారిపాలెం మండలం మాలకొండలో ఒక విద్యుత్ సబ్ స్టేషన్ త్వరలోనే అనుమతులు వస్తాయని ఏఈ మధుబాబు తెలిపారు. అలాగే విద్యుత్ కొరత నివారణ చర్యలలో భాగంగా రాష్ట్రప్రభుత్వం సోలార్‌పవర్ సోలరైజేషన్ ప్లాంట్స్ ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తున్నద న్నారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్‌పవర్ ప్లాంట్ ఏర్పాటుకు 4 ఎకరాల భూమి అవసరం అవుతుందని, సబ్‌స్టేషన్లకు దగ్గరలో ఎవరైనా భూమి లీజుకు ఇచ్చేందుకు ముందుకొస్తే ఎకరానికి ఏడాదికి రూ.30వేలు లీజు ఇస్తారని తెలిపారు.

పేద మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



తోటపల్లిగూడూరు: మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సన్నారెడ్డి

తోటపల్లిగూడూరు, ఆగస్టు 25: పేద మహిళలను లక్షాధికారులను చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించిన లక్‌పత్ దీదీ యోజన పథకానికి సంబంధించి మండలంలోని సంఘమిత్ర కార్యాలయంలో సీఆర్‌పీ, వీవోఏలకు సురేష్‌రెడ్డి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళాభ్యున్నతికి చేస్తున్న కృషిని వివరించారు. ఏపీఎం శైలజ మాట్లాడారు. 3333 గ్రామీణ గ్రూపుల వారికి సర్టిఫికెట్లు, చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇసుకపాలెం సర్పంచ్ ఇంగిలాల చైతన్య, డిప్యూటీ తహసీల్దారు శివయ్య, సీఆర్‌పీలు, వీవోఏలు పాల్గొన్నారు.

●**వెంకటాచలం:** మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం వెలుగు ఏపీఎం సుమతి ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన లక్‌పత్ దీదీ యోజన పథకానికి సంబంధించి నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పొదుపు సంఘాలకు సర్టిఫికెట్స్ అందజేశారు. పొదుపు సంఘాల్లోని డ్వాక్రా మహిళలకు అండగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు ఓబమ్మ, రాజేశ్వరమ్మ, విజయమ్మ, మాధవి, డ్వాక్రా మహిళలు తదితరులున్నారు.

●**మనుబోలు:** స్థానిక డ్వాక్రా కార్యాలయంలో ఆదివారం లక్‌పతి దీదీ కార్యక్రమంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం వనజాక్షి మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సీసీలు, పలు గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●**రాపూరు:** భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన లఖ్‌పతి దీదీ పథకాన్ని సంఘమిత్ర సభ్యులందరూ ఉపయోగించుకోవాలని ఇన్‌చార్జి ఏపీఎం కె.మాధవి కోరారు. ఆదివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ పథకంపై అవగాహన కల్పించారు. మండల సీసీలు, ఈవోపీలు, అధ్యక్షురాళ్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ఆయా ప్రాంతాల్లో ఈ పథకం ఉపయోగాలను సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



సర్వమత ప్రార్థనలు చేస్తున్న విద్యార్థులు

ఇందుకూరుపేట, ఆగస్టు 25: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ, స్థలదాత పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ ఆశయాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు ఎస్ఐ బదిలీ

మనుబోలు, ఆగస్టు 25: మనుబోలు ఎస్ఐగా పని చేస్తున్న జి అజయ్‌కుమార్ ఆదివారం బదిలీ అయ్యారు. అయితే మనుబోలు స్టేషన్‌కు కొత్త ఎస్ఐ నియామకం జరగలేదు. గతేడాది జూన్ 29నుంచి మనుబోలులో అజయ్‌కుమార్ ఎస్ఐగా విధులు నిర్వహించారు.

బీజేపీ నేత పెంచలయ్యపై కేసు నమోదు చేయాలి

● పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న నాము రవీంద్ర తదితరులు

వెంకటాచలం, ఆగస్టు 25: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేసిన మండలంలోని కందలపాడు గ్రామానికి చెందిన బీజేపీ నేత పిల్లిపాకుల పెంచలయ్యపై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని కందలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత నాము రవీంద్ర ఆదివారం వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గత ఐదు రోజుల క్రితం పిల్లిపాకుల పెంచలయ్య నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో సోమిరెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేసిన పెంచలయ్యను వెంటనే అరెస్టు చేయాలని ఫిర్యాదుదారుడు రవీంద్ర పోలీసులను కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు నాగరాజు, రమేష్, వేణు, సునీల్ తదితరులు ఉన్నారు.

వీరంపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరం

మనుబోలు, ఆగస్టు 25: మండలంలోని వీరంపల్లిలో ఆదివారం ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. గూడూరు కేవి హాస్పిటల్, హారిక కంటి వైద్యశాల వారు సంయుక్తంగా ఈ శిబిరంను నిర్వహించి పలువురికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే చిన్నారులకు, మహిళలకు వైద్యులు నారా కీర్తి, రేచర్ల త్రివిక్రమరావు, మల్లెమాల హారికరెడ్డి, లక్ష్మీనారాయణలు ఉచిత వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు వి ప్రసాద్, రఘురామయ్య, శ్రీనువాసులురెడ్డి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మకు పూలంగి సేవ



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

మనుబోలు, ఆగస్టు 25: మండలంలోని బండేపల్లిలో కొలువైన గంగమ్మకు ఆదివారం పూలంగి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తిరునాళ్లలో భాగంగా గంగపెట్టెను గ్రామంలో ఊరేగించి ఆలయంలో అమ్మవారికి పూలంగిసేవ చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

ముత్తుకూరు, ఆగస్టు 25: మండలంలోని వల్లూరులో గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని సాయంత్రం గ్రామ పొంగళ్లు నివేదించి మొక్కులు చెల్లించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ముత్యాలమ్మకు పూలంగి సేవ నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

చింతలపాళెంలో పుట్టాలమ్మ తిరునాళ్ల

వెంకటాచలం: మండలంలోని కసుమూరు పంచాయతీ చింతలపాళెంలోని పుట్టాలమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతమ్మను దర్శించుకున్నారు. ఆయన వెంట నలబాలపు వెంకటాద్రి, కడివేటి శేషయ్య, కూరపాటి మస్తానయ్య, గుంటి పెంచలయ్య, తదితరులున్నారు. అనంతరం గుమ్మడి రాజాయాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ సీనియర్ నేత నలబాలపు రమణయ్యను పరామర్శించారు.

పేద గిరిజనులకు దుస్తుల పంపిణీ

వెంకటాచలం, ఆగస్టు 25: స్థానిక బేతేలు చర్చి ఆవరణలో ఆదివారం నైనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఎస్‌సీ సుహాసిని, డాక్టర్ బెంజమిన్ ఐజక్, డాక్టర్ సైమన్ సాహిత్, తదితరులున్నారు.

కామాక్షితాయి సేవలో జిల్లా అదనపు న్యాయమూర్తి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 25: జొన్నవాడ ఆలయంలో మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారిని ఆదివారం జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి గీతా చంద్రకుమార్ దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదములు అందజేశారు. అనంతరం వారు నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వెళ్లారు.

రంగస్థల నటి పద్మావతి అంత్యక్రియలు

● పాల్గొన్న ప్రముఖులు

రంగస్థల నటి బండారు పద్మావతి అంత్యక్రియలు కళాకారులు, కళాభిమానుల నడుమ ఆదివారం రేబాలలోని స్వగృహం వద్ద జరిగాయి. అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రముఖ రంగస్థల నటుడు, జూనియర్ డీవీ సుబ్బారావు, స్థానిక నేతలు గోవర్ధన్‌రెడ్డి, పలు జిల్లాల కళాకారులు, కళాభిమానులు, స్థానిక నేతలు, బంధువులు, ప్రజలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం బాలకృష్ణ గిరిజన కాలనీకి చెందిన పత్రి వెంకటేశ్వర్లు (60) చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడని ఆదివారం బుచ్చి పోలీసులు తెలిపారు. మనస్థాపంతో శనివారం ఉదయం పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వెంకటేశ్వర్లు నెల్లూరు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్త, ఆడబిడ్డ వేధింపులపై ఫిర్యాదు

తన భర్తతోపాటు ఆడబిడ్డ కొట్టి, వేధిస్తున్నారని స్థానిక రామకృష్ణా నగర్‌కు చెందిన షేక్ కరిష్మా ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



విద్యుద్దీపకాంతుల్లో వేణుగోపాలస్వామి ఆలయం

కృష్ణం వందే జగద్గురుం

● నేడు శ్రీకృష్ణాష్టమి ● ఆలయాల్లో ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 : భగవద్గీత ద్వారా జీవిత సత్యాలను బోధించిన శ్రీకృష్ణుడు పరమాత్మేకాదు జగద్గురువు కూడా. ఆయన పుట్టిన రోజే కృష్ణాష్టమి. కృష్ణుడు చిన్నతనంలో గోకులంలో పెరిగాడు. కాబట్టి గోకులాష్టమి అని కూడా పిలుస్తారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో ఉత్సవాలకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. అలాగే, పలు కూడళ్లలో జన్మాష్టమిని ఘనంగా జరిపేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. కృష్ణమందిరాలు అన్నీ విద్యుద్దీపాలంకరణతో కళకళలాడుతున్నాయి. ఈ పండుగ రోజు చిన్ని కృష్ణుడు ఇంటిలోకి ప్రవేశిస్తున్నట్లుగా కృష్ణ పాద ముద్రలను పిండి ముగ్గుతో వేస్తారు. శ్రీకృష్ణుని బాలక్రీడలు జ్ఞప్తికి తెచ్చుకునే విధంగా ఉట్టి మహోత్సవాలు నిర్వహిస్తారు. ఇస్కాన్ మందిరంతోసహా అన్ని కృష్ణమందిరాల్లో వేడుకలు జరుగుతున్నాయి. ఇస్కాన్ మందిరంలో ఉదయం 6 నుంచి రాత్రి 12గంటల వరకు విశేష పూజలు జరుగుతాయి. మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో మూలవర్లకు పూలంగి సేవ, పూజలు జరుగుతాయి. సుజాతమ్మ కాలనీ అష్టలక్ష్మీ ఆలయం కృష్ణ మందిరంలో శ్రీకృష్ణాష్టమి పూజలు విశేషంగా జరుగుతాయి.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణ మందిరంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణస్వామికి విశేష పరిమళ ద్రవ్యాలతో, పంచామృతాలతో జరిగాయి. సాయంత్రం బ్రహ్మోత్సవాలకు, విష్వక్సేనారాధన, అంకురార్పణ, కలశ పూజలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ జరిగింది. ఈ వేడుకలను ఉభయకర్తలు, దర్మకర్తలు సీహెచ్ వెంకటేశ్వర్లు, సుబ్బరామరాజు, బీవీ రాఘవేంద్రరావు, జాదర్‌దేవదాస్ సేట్, కే మాలకొండయ్య, ఎన్ .రామమూర్తి పర్యవేక్షించారు.

బాలభవన్‌లో వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం) : ఇస్కాన్‌సిటీ హనుమాన్ జంక్షన్‌లోని హనుమాన్ ఆలయంలో బాలభవన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. జయదేవుని అష్టపదులు, కృష్ణుడి మీద పాటలు, పద్యాలు, నృత్యాలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. బాలభవన్ డైరెక్టర్ జీ సుభద్రాదేవి, స్థానిక ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీకృష్ణ అవతార మహోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం నుంచి సెప్టెంబరు 2వతేదీ వరకు శ్రీకృష్ణ అవతార మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సహాయ కమిషనర్ దాసరి చంద్రశేఖర్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 5గంటలకు మూలవర్లకు తిరుమంజనం, శ్రీకృష్ణ అవతారం అలంకారం జరుగుతాయన్నారు. 28వతేదీ రాత్రి ఉట్టి మహోత్సవం, 29న కాళీయ మర్దనం, 30వతేదీ పొన్నవాహన సేవ జరుగుతాయని తెలిపారు. 31వతేదీ రాత్రి గోవర్ధన గిరి, సెప్టెంబరు 1వతేదీ రాసక్రీడలు, 2వతేదీ రాత్రి రుక్మిణీ కల్యాణ ఉత్సవాలు జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.



కృష్ణ మందిరంలో గోపూజ చేస్తున్న భక్తులు



శ్రీకృష్ణ భగవానుడికి విశేష అలంకరణ



బాలభవన్ వేడుకల్లో కృష్ణ వేషధారణలో చిన్నారులు

శ్రీసాయిమాత అన్నప్రసాద నిలయం వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 : నగరంలోని బాలాజీనగర్ సాయిదర్బార్ ప్రాంగణంలోని శ్రీసాయిమాతా అన్నప్రసాద నిలయం తృతీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సాయినామ సంకీర్తనలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సోమవారం ఉదయం 9గం టలకు ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం జరుగుతుం దని, భక్తులు అందరూ తరలిరావాలని సాయిదర్బార్ నిర్వాహకుడు మధుసాయి కోరారు.

వేద ధర్మానుసారమే భారతీయ సదాచారాలు

నెల్లూరు (సాంస్కృతికం) : భారతీయ సంస్కృతి, సాహిత్యం, సదాచారాలు వేద ధర్మానుసారం ప్రకాశించాలని పోలూరి హనుమజ్జానకీ రామ శర్మ కృషి చేశారని సింగరాజు రామకృష్ణ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం పద్మకళాపరిషత్ ఆధ్వర్యంలో టౌనుహాలు ఏసీ మందిరంలో పోలూరి హనుమజ్జానకీరామశర్మ శత జయంతి ఉత్సవాల్లో సాహిత్య ప్రవచనం జరిగింది. హనుమజ్జానకీరామశర్మ ఏర్పాటు చేసిన మాళవీయ సాహిత్య మండలి ఆశయాలపై ప్రసాదరావు ప్రసంగించారు. భారతీయ విలువలు యువతరంలో నింపేందుకు రామశర్మ చేసిన కృషిని వివరించారు. కార్యక్రమాన్ని మెట్టు రామచంద్రప్రసాద్, ఎన్ బలరామయ్య నాయుడు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, వేదం రాధాకృష్ణమూర్తి, శ్రీరామమూర్తి, శతావధాని కొండేపి మురళీకృష్ణ పర్యవేక్షించారు.

మల్లికార్జున స్వామికి పెన్నా జలాలతో అభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 : నగరంలోని వైకుంఠపురంలో లోక కల్యాణార్థం ఆదివారం కనకదుర్గా సమేత మల్లికార్జునస్వామికి పెన్నా జలాలతో కలిశాభిషేకం వైభవంగా జరిగింది. ఉదయం వైకుంఠపురం నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి రంగనాథస్వామి ఆలయం వద్ద కలిశాలలో పెన్నా జలాలను నింపుకున్నారు. పెన్నానదికి హారతులు పట్టారు. కలిశాలను తలపై ఉంచుకుని జై దుర్గ.. జైజై కనకదుర్గ అంటూ నినాదాలతో ఊరేగింపుగా వైకుంఠపురం చేరుకున్నారు. ఆ తర్వాత పెన్నా జలాలతో మల్లికార్జునస్వామికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆశ్రమం నిర్వాహకులు ధన్వి శ్రీనివాస్, మహంకాళి వెంకటేష్, మహేష్, కుడుముల వెంకటేష్, సిద్ధూ, లక్ష్మణ్, చంద్ర, తదితరులు పర్యవేక్షించారు.



రంగనాథస్వామి ఆలయం వద్ద పెన్నాజలాల కలిశాలతో మహిళలు

చవితి ఉత్సవాలకు సంపూర్ణ సహకారం

● గణేష్ ఉత్సవ సమితి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 : ప్రజల్లో ఐక్యత, జాతీయతను పెంపొందించేలా నగరంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలని ఉత్సవ నిర్వాహకులకు విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి పిలుపునిచ్చింది. ఆదివారం విజయమహల్ సెంటర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో ఉత్సవ నిర్వాహకులతో సమితి నాయకులు సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు 11వతేదీ గణేష్ నిమజ్జన శోభాయాత్రను విజయవంతం చేసేందుకు సెప్టెంబరు 1 నుంచి ఉత్సవ మండపాల నిర్వాహకులకు గణేష్ సమితి సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘటన కార్యదర్శి కొండపల్లి శ్రీకాంత్, కోశాధికారి ఏవీఆర్ మోహన్‌రావు, కేవీ సుబ్రహ్మణ్యం, పీ భాస్కర్‌రావు, బీ మల్లికార్జునరెడ్డి, నూకరాజు మహేష్, కృష్ణారెడ్డి, మండ్ల ఈశ్వరయ్య, డీటీ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి

● డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 25 : ప్రజా సమస్యలపై నిత్యం పోరాడాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో 15వ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రబలుతున్న విష జ్వరాలు, దోమల బెడద వంటి సమస్యలు పరిష్కారం అయ్యే దిశగా అందరూ కృషి చేయా లన్నారు. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా 13మందితో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సూర్యనారాయణ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఏలో 'కృష్ణచైతన్య'కు ఉత్తమ ర్యాంకులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 25: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఎంసీఏ మూడో సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎంసీఏ సెమిస్టర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఆర్ నలుబోలు సుమ 635 మార్కులతో మొదటి ర్యాంకు, జీ తేజస్విని 634 మార్కులతో ద్వితీయ ర్యాంకు, కే చైతన్య 628 మార్కులతో తృతీయ స్థానం సాధించారని చెప్పారు.

ప్రజల్లోకి ఆల్ ఇండియా అమ్మ పార్టీ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 25 : ప్రస్తుత ప్రభుత్వాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రశ్నిస్తూ ఆల్ ఇండియా అమ్మ పార్టీ ప్రజలకు చేరువయ్యేందుకు కార్యక్రమాలు రూపొందించినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు టీఎన్ రాజు తెలిపారు. ఆదివారం నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై నిఘా పెట్టి అర్హులైన వారికే సరుకులు అందేటట్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. త్వరలో గ్రామస్థాయి నుంచి సభ్యత్వాలు నమోదు చేస్తామని, పార్టీ కమిటీల ఏర్పాటుపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు కే శ్యామలారెడ్డి, జనరల్ కార్యదర్శి ఏ రాగసుధ, జాతీయ కోశాధికారి షేక్ మెహరున్నీసా, డాక్టర్ కే నరసింహారెడ్డి, వీ శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజు



● ఇస్కాన్‌లో మొదలైన వేడుకలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 25: గోపబాలుడి జన్మదిన వేడుకలు ఏడుకొండల ముంగిట ముందుగానే ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం నుంచే తిరుపతిలోని ఇస్కాన్ శ్రీకృష్ణ మందిరంలో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటలకు ఆదివాసీ ఉత్సవం నిర్వహించారు. 6.30 గంటల నుంచి ఆలయం ఎదురుగా ఉన్న టీటీడీ క్రీడామైదానంలో పలు సంగీత, నృత్య కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలను వివిధ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

8 నుంచి రాత్రి 11.45 గంటల వరకు భక్తులకు దర్శనం

సోమవారం శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ఇస్కాన్ మందిరంలో వేకువ జామున 4 గంటల నుంచి మంగళహారతి, తులసి పూజ, నరసింహ కీర్తన జరుగుతాయి. ఎనిమిది నుంచి రాత్రి 11.45 గంటల వరకు భక్తులకు దర్శనం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు టీటీడీ మైదానంలో ఉట్లోత్సవం జరుగుతుంది. 6.30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి. రాత్రి 11గంటలకు రాధా గోవిందులకు మహాశంఖాభిషేకం జరుగుతుంది.



విద్యుత్ దీపాలంకరణ





ఇందిరా మైదానంలో వేదిక, ద్వారకలోని మధుర సెట్టింగు

ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ డిజైన్ రెడీ



ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ నమూనా

- ● సీఎం చంద్రబాబు ఆమోద ముద్రే తరువాయి
- ● తిరుపతిలో రూ.500 కోట్లతో కొత్త బస్టాండుకు త్వరలో శంకుస్థాపన
- ● కేంద్ర కమిటీ సభ్యుల పరిశీలన



సీబీఎస్ ప్రాంగణంలో సందర్శిస్తున్న కేంద్రబృందం

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 25: తిరుపతిలో ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ నిర్మాణానికి త్వరలో పునాదిరాయి పడనుంది. ఇప్పటికే పూర్తయిన బస్ టెర్మినల్ డిజైన్‌కు సీఎం చంద్రబాబు ఆమోద ముద్ర పడగానే పట్టాలెక్కనుంది. రూ.500కోట్ల బడ్జెట్‌తో నిర్మాణం కానున్న ఈ బస్సు టెర్మినల్‌పై నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) సీఈవో ప్రకాష్‌గౌర్ నేతృత్వంలో కేంద్ర బృందం ఆదివారం తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణాన్ని పరిశీలించింది. ఆర్టీసీ అధికార, అనధికార సభ్యులతో సమీక్షించింది. కొత్త డిజైన్‌ను పరిశీలించి.. ప్రయాణికులకు కల్పించే సదుపాయాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, మరుగుదొడ్లు, ప్లాట్‌ఫామ్స్, కార్యాలయాలు, మినీ గ్యారేజీ, ప్రవేశం, నిష్క్రమణ ద్వారాలు, నలువైపులా రహదారులు, పారిశుధ్యం, విద్యుత్, ప్రైవేటు వాహనాల పార్కింగ్, రైల్వేస్టేషన్ నుంచి జాయింట్ బ్రిడ్జి, అండర్ పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. దాదాపు రూ.500కోట్ల వ్యయంతో పది అంతస్తులతో అధునాతన భవనం నిర్మాణం అద్భుతంగా ఉంటుందన్నారు. అయితే ఎలక్ట్రిక్ బస్సుల రీచార్జింగ్ కేంద్రాలు పలుచోట్ల ఏర్పాటు చేసుకుంటే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉంటుందని, అత్యవసర పరిస్థితి దృష్ట్యా మినీ గ్యారేజీ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. వచ్చే 30 ఏళ్లవరకు సమస్య లేకుండా నిత్యం ఐదువేల బస్సుల రాకపోకలు, 2.5లక్షలమంది ప్రయాణికుల సందర్శనకు అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భవనాన్ని దశలవారీగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నగర శివార్లలో డిపోలు, గ్యారేజీలు ఉండాలని సూచించారు. మున్సిపల్, తుడ, పొల్యూషన్, ఫైర్, విమానయాన, విద్యుత్ విభాగాలను సంప్రదించి అనుమతులు ఇప్పించాలన్నారు. డిజైన్లను త్వరలో సీఎంకు అందజేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని, మూడేళ్లలో పూర్తవుతుందన్నారు. వారం వ్యవధిలోనే తగిన చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులను, ఎంపీని కోరారు. బస్టాండుకు ఆగ్నేయంలో ఉన్న ప్రైవేటు స్థలం సమస్యను కొలిక్కి తేవాలన్నారు. దాంతో ఎంపీ కల్పించుకుని కలెక్టర్‌తో సంప్రదించి వారికి ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలం ఇవ్వాలని కోరతామన్నారు. నమూనాలో కొంత మార్పులు చేర్పులు ఉండడంతో కాస్త ఆలస్యమవుతోందని అభిప్రాయపడ్డారు. టీడీపీ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, ఆర్టీసీ అధికారులు నరసింహులు, భాస్కర్ రెడ్డి, రామచంద్రనాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అధికారిక సమీక్షలో జనసైనికులు



కేంద్ర కమిటీ సభ్యులు నిర్వహించిన సమీక్షలో జనసేన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు పాల్గొనడం చర్చకు దారితీసింది. ఎన్‌హెచ్ఏఐ సీఈవో అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓవైపు ఎంపీ గురుమూర్తి ఆశీనులవ్వగా మరోవైపు జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి కూర్చొన్నారు. 'వేర్ ఈజ్ ఎమ్మెల్యేజీ' అని సీఈవో అడిగితే.. అనివార్య కారణాలతో రాలేకపోయారని తమను పంపినట్టుగా అక్కడికి వచ్చిన జనసైనికులు సమాధానమివ్వడంతో ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. అధికారిక కార్యక్రమాల్లో జనసైనికులు పాల్గొనకూడదని ఓవైపు ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరిస్తున్నప్పటికీ తిరుపతి జనసైనికులు మాత్రం చెవికెక్కించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధులను కలిసిన ఆరణి

ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి తిరుపతికి వచ్చిన కేంద్ర కమిటీ ప్రతినిధులను స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం సాయంత్రం హోటల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్‌హెచ్ఏఐ సీఈవో ప్రకాష్‌గౌర్, ప్రాజెక్టు డైరెక్టర్ పూజా మిశ్రాలను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నూతన బస్సు టర్మినల్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు గతం(2014-19)లో సీఎంగా ఉన్నప్పుడు బస్సు టెర్మినల్ నిర్మించాలని నిర్ణయించారని, జగన్‌రెడ్డి వచ్చాక పట్టించుకోకుండా గాలికొదిలేశారన్నారు. నవంబరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి.. మార్చిలో కొత్త టర్మినల్ పనులకు శ్రీకారం చుడతామన్నారు. మళ్లీ చంద్రబాబు సీఎం కావడంతో తిరుపతివాసుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ఈ భేటీలో జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మేనకూరులో విషాద ఛాయలు



మేనకూరులో రమేష్‌బాబు ఇల్లు

● అమెరికాలో జరిగిన కాల్పుల్లో వైద్యుడి మృతితో కుటుంబీకులు, స్థానికుల దిగ్భ్రాంతి



అమెరికాలో అవార్డు అందుకుంటున్న రమేష్‌బాబు (ఫైల్ ఫొటో)

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25: అమెరికాలో జరిగిన కాల్పుల్లో డాక్టర్ పేరంశెట్టి రమేష్‌బాబు మృతి చెందాడని తెలియడంతో ఆయన స్వగ్రామమైన నాయుడుపేట మండలం మేనకూరులో ఆదివారం విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్న గురునాథం - రాజేశ్వరమ్మ దంపతుల మూడో కుమారుడైన ఈయన అమెరికాలో అనేక ఆస్పత్రులను నిర్మించి అత్యుత్తమ వైద్యసేవలందించారు. దీన్ని గుర్తించిన ఆ దేశం.. అమెరికాలో ఓ వీధికి ఆయన పేరును పెట్టింది. కరోనా సమయంలోనూ అమెరికాలో విశేష సేవలు అందించి, పురస్కారాలు అందుకున్నారు. ఇక తన స్వగ్రామం అభివృద్ధికీ చేయూతనందించారు. తాను విద్యను అభ్యసించిన పాఠశాలకు రూ.14 లక్షలు విరాళం ఇచ్చారు. గ్రామంలోని సాయిబాబా మందిరం నిర్మాణానికి రూ.20 లక్షలను అందించారు. ఈనెల 15వ తేదీ నాయుడుపేటలోని తన సమీప బంధువుల వివాహవేడుకల్లో పాల్గొన్న రమేష్‌బాబు మృతి చెందాడని తెలియడంతో వారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. కాగా, రమేష్‌బాబు తల్లి రాజేశ్వరమ్మ తిరుపతిలో మరో కుమారుడు సురేష్ దగ్గర ఉంటోంది. కుమారుడి మరణవార్త విన్న వెంటనే రాజేశ్వరమ్మ, ఆమె కుటుంబీకులు అమెరికాకు బయల్దేరి వెళ్లారు.



చీపుర్లు చేతపట్టిన డాక్టర్లు

● స్విమ్స్‌లో వైద్యులను రోడ్డున పడేశారంటూ జూడాల వినూత్న నిరసన

తిరుపతి(వైద్యం), ఆగస్టు 25: స్విమ్స్‌లోని అత్యవసర విభాగంలో జూనియర్ డాక్టరుపై జరిగిన రోగి దాడిని ఖండిస్తూ జూనియర్ డాక్టర్లు (జూడాలు) చీపుర్లు చేతపట్టారు. స్విమ్స్ ఆవరణను శుభ్రం చేస్తూ ఆదివారం రాత్రి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈసందర్భంగా జూడాలు మాట్లాడుతూ.. స్విమ్స్‌లో వైద్యులను రోడ్డున పడేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా తమ న్యాయ పరమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఇలాంటి నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున కొనసాగిస్తామని తెలిపారు. ఇక టీటీడీ ఈవోతో సోమవారం జరిగే సమావేశంలో తమకు ఎంతవరకు న్యాయం జరుగుతుందో చూస్తామని.. ఆపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

పులిబోనుపల్లె వద్ద ఏనుగు మృతి



ఏనుగు కళేబరం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25: తలకోన అటవీ సరిహద్దు గ్రామం ఎర్రావారిపాలెం మండలంలోని పులిబోనుపల్లె వద్ద ఓ ఏనుగు మృతి చెందింది. సుమారు ఆరేళ్ల వయసున్న ఈ గజరాజు నాలుగు రోజుల కిందట చనిపోయినట్లు అటవీ అధికారులు ఆదివారం ఉదయం ఆలస్యంగా గుర్తించారు. తలకోన అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల వేట జోరుగా సాగుతోంది. 11 కేవీ లైను నుంచి కరెంటు తీసి, కొందరు వేటాడడం జరుగుతుంది. అయితే ఏనుగు అనారోగ్యంతో మరణించిందా లేక విద్యుతాఘాతమా అన్నది పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలియనుంది. ఈ ప్రాంతంలో ఇది రెండో సంఘటన. గతంలో నాటు బాంబు నమిలి గున్నఏనుగు మృతి చెందింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 'గజ' మరణ ఘోష

◆ 14 ఏళ్లలో 46 మృతి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లా అడవులో వన్యప్రాణులకు రక్షణ కరువైతున్నది. 14 ఏళ్లలో 46 ఏనుగు మృత్యువాత పడ్డాయి. కారణాలు ఏవైనా అరుదైన ఏనుగులు మృతి చెందడం జరుగుతూనే ఉండడంతో వన్యప్రాణి ప్రియులు ఆవేదన చెందుతున్నారు.

సంవత్సరాల వారీగా మరణాలు

- ● 2010లో ఎర్రావారిపాలెం చింతగుంట గ్రామం కృష్ణయ్య పొలంలో కరెంట్ షాక్‌తో ఒక ఏనుగు మృతి.
- ● 2011లో దేవరకొండ గ్రామం తిమ్మారెడ్డి మామిడితోపులో బావి లోపడి గర్భంతో ఉన్న ఆడ ఏనుగు మృతి.
- ● 2012లో సిద్దలగండి ప్రాజెక్టులో నీటి కోసం వెళ్లిన గున్నఏనుగు ఊబిలో దిగబడి మృతి.
- ● 2013లో కరెంట్ షాక్‌తో ఓ ఏనుగు మృతి. కుప్పంలో విద్యుత్ షాక్‌తో మూడు గజరాజులు మృత్యువాత పడ్డాయి.
- ● 2014 కౌండిన్య అభయారణ్యంలో అనారోగ్యంతో ఓ ఏనుగు మృతి.
- ● 2015లో పులుబోనుపల్లె వద్ద నాటు బాంబు నమిలి ఏనుగు దుర్మరణం. రామకుప్పం అడవిలో ఒకటి, ఎర్రావారిపాలెం సుబ్బరామాపురం వద్ద కరెంట్ షాక్‌తో మరో ఏనుగు మృతి.
- ● 2017లో ఎర్రావారిపాలెం కోటకాడపల్లె వద్ద విద్యుత్ షాక్‌తో ఏనుగు మృత్యువాత.
- ● 2018 రామకుప్పం శెట్టిపాలెం పొలాల్లో విద్యుత్ షాక్‌తో ఏనుగు మరణం.
- ● 2019లో ననియాల అడవులోని చెత్తపెంట వద్ద ఒకటి, పలమనేరు గొబ్బిళ్లటూరు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మరో ఏనుగు మృతి. ఇదే ఏడాది ననియాల అడవులో ఆడ ఏనుగును మదపుటేనుగు గుద్ది చంపింది. కుప్పం ప్రాంతంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ఒకటి మృతి. ఇదే ఏడాదిలోనే తమిళనాడు-ఆంధ్ర సరిహద్దులో రైల్వే ట్రాక్‌పై ఎనిమిది గజరాజుల మృతి. కోటకాడపల్లె వద్ద అనారోగ్యంతో ఒకటి, ఐరాల వద్ద రెండు ఏనుగులు కరెంట్ షాక్‌తో మృతి చెందగా.. రైతు గోతితీసి పూడ్చి వేశారు. బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లె వద్ద పొలంలో విద్యుత్ షాక్‌తో ఓ ఏనుగు మృతి.
- ● 2020లో చిత్తూరు సమీపంలోని గంగవరం వద్ద విద్యుత్ షాక్‌తో ఏనుగు మరణం.
- ● 2021లో పలమనేరు కోతిగుట్ట వద్ద ట్రాన్స్‌ఫారం ఢీకొని ఏనుగు మరణం, ఇదే మండలంలో విద్యుత్ షాక్‌తో ఒంటరి ఏనుగు మృతి. బంగారుపాలెం రాగిమానుపెంట వద్ద, సోమల మండలంలో విద్యుత్ వైర్లు నమలడంతో రెండు మృతి. కార్వేటినగరం మండలంలో ట్రాన్స్‌పార్మర్‌ను తాకడంతో ఓ ఏనుగు మృతి.
- ● 2022లో సదుం చెరుకువారిపల్లె వద్ద విద్యుత్ షాక్‌తో ఒకటి. మొగిలి ఘాట్ వద్ద ట్రాన్స్‌పార్మర్ తగిలి ఒకటి, బంగారుపాళ్యం మండలం చిట్టేరి మామిడితోపులో విద్యుత్ షాక్‌తో ఒకటి. టేకు మంద వద్ద స్తంభాన్ని ఢీకొనడంతో తీగలు తెగిపడి ఒకటి. మొగిలిపెంట వద్ద మామిడి చెట్లు విరిచే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి ఒకటి. టేకుమంద కొణతలమడుగు సమీపంలో పూలవానికుంట వంక వద్ద మామిడితోటలో విద్యుత్ తీగలు నమలడంతో గర్భంతో ఉన్న ఏనుగు మృతి.
- ● 2023లో మొగిలి ఘాట్ వద్ద మినీ లారీ ఢీకొని మూడు ఏనుగులు మృతి. భైరెడ్డిపల్లె నెల్లిపల్లి పంచాయతీ నల్లగుట్టపల్లె వద్ద తమిళనాడు నుంచి వచ్చి ఆరు ఏనుగుల మంద విద్యుత్ స్తంభం గుద్దడంతో వైరు పైనబడి ఒకటి మృతి.
- ● 2024లో ఎర్రావారిపాలెం పులిబోనుపల్లె వద్ద ఏనుగు మృత్యువాత పడింది.



ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్ద స్లాటెడ్ టోకెన్ల భక్తులు

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు

తిరుమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. శని, ఆదివారాలతోపాటు సోమవారం గోకులాష్టమి వంటి వరుస సెలవుల నేపథ్యంలో శనివారం రాత్రి నుంచే కొండకు వచ్చే భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి మాడవీధులు, అఖిలాండం, లడ్డూ వితరణ కేంద్రం, అన్నప్రసాద భవనం, బస్టాండ్ వంటి ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. సర్వదర్శనం భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శన సమయం పడుతోంది. అలాగే గదుల కోసం భక్తులు సీఆర్వో వద్ద క్యూలో బారులు తీరారు. సిఫార్సుల లేఖలపై గదులు ఇచ్చే పద్మావతి, ఎంబీసీ24, టీబీ కౌంటర్లు కూడా కిటకిటలాడాయి. మరోవైపు తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా రద్దీగా దర్శనమిస్తున్నాయి. స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులతో ఎస్వీ గెస్ట్‌హౌస్ ప్రాంతం సందడిగా మారింది. ఇచ్చిన సమయానికంటే ముందుగానే వచ్చిన భక్తులు ఫుట్‌పాత్‌లపై సేదతీరుతూ కనిపించారు.



కృష్ణతేజ సర్కిల్ వద్ద సర్వదర్శన క్యూలైన్



ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్ద ఫుట్‌పాత్‌పై సేదతీరుతున్న యాత్రికులు

లాక్‌పతి దీదీపై మహిళలకు అవగాహన


సభ్యులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఓజిలి, ఆగస్టు 25 : అక్క చెల్లెమ్మలను లక్షాధికారులుగా చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లాక్‌పతి దీదీ' పథకంపై ఓజిలిలోని స్త్రీ శక్తి భవనంలో సభ్యులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ఏపీఎం నిర్మల అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీల పరిధిలోని వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఎంపిక చేసిన సంఘం నుంచి ఇద్దరు సభ్యులకు చిన్నతరహా పరిశ్రమలు, వ్యాపారం వంటివి ప్రారంభించుకునేందుకు ఆర్థిక సాయం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్దేశించారు. ఈక్రమంలోనే వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎంతోపాటు జిల్లా టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మండల టీడీపీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, బీజేపీ నాయకులు ప్రసాద్, మైనారిటీ నాయకులు అల్లాభక్షులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన చోదకులకు హెచ్చరికలు

ఓజిలి, ఆగస్టు 25 : రాజుపాళెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం నేపథ్యంలో ఆదివారం ఎస్‌ఐ రవిబాబు పలు ప్రాంతాలలో పర్యటించారు. నిబంధనలు పాటించాన ద్విచక్రవాహన చోదకులకు హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డు ప్రమాద నివారణపై సూచనలు చేశారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రహదారి సూచనలు పాటించాలన్నారు. పలు వాహనాలను ఆయన తనిఖీ చేశారు.

ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల ప్రారంభం


బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 25: ఉపాధ్యాయులకు క్రీడాపోటీలను నిర్వహించేందుకు ప్రగతి సేవాసంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా ఉండేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. 19 మండలాలకు చెందిన ఉపాధ్యాయుల జట్లు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, వేగూరు రాజేంద్రప్రసాద్, శివకుమార్, సంస్థ అధ్యక్షుడు కే. చంద్రశేఖర్, ప్రకాశ్‌రావు, సురేష్‌బాబు, మురళీ సింగ్, రవూఫ్, ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మిలటరీస్కూల్స్ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకు చివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 25: స్థానిక డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ గౌరీశంకర్ మాట్లాడుతూ తిరుపతి వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యపరీక్షలను నిర్వహించారన్నారు. మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సీతారామనాయుడు,డాక్టర్ కీర్తన, డాక్టర్ దీప్తి, కృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌గా రాఘవేంద్ర మీనా

గూడూరు అర్బన్, ఆగస్టు 25: గూడూరు సబ్ కలెక్టరుగా రాఘవేంద్రమీనాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రాఘవేంద్రమీనాను సబ్ కలెక్టర్‌గా నియమించారు. ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ ముగించుకున్న ఈయనకు తొలి పోస్టింగ్ ఇది.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

పెళ్లకూరు, ఆగస్టు 25 : మండలంలోని కానూరు రాజుపాలెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో దాడి చేశారు. కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి 19 మందిని అదుపులోకి తీసుకున్నారు రూ.3280 నగదు స్వాధీనం చేసుకున్నారు. 10 బైక్‌లు, 17 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.. వీరందని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమవారం వీరికి కోర్టులో హాజరుపరచనున్నటు పేర్కొన్నారు.

అంధుల పుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


జాతీయ పుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వెంకటగిరి, ఆగస్టు 25 : పాక్షిక అంధత్వమున్న వారికి ఏపీ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పుట్‌బాల్ సెలక్షన్స్, కోచింగ్ క్యాంపు ఆదివారం తిరుపతిలో నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచల నరసయ్య తెలిపారు. వెంకటగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ జిల్లాలకు చెందిన 20 మంది క్రీడాకారులు ఎంపికకు హాజరయ్యారన్నారు. పది మంది ఎంపికైనట్లు వివరించారు. వీరు అక్టోబరులో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారన్నారు. అసోసియేషన్ ద్వారా అంధ క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పుట్‌బాల్ కోచ్ హరిబాబు, శాంసన్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ముపాళ్ల శేషగిరిరావు, మునిరత్నం, కోశాధికారి వినయ్ కుమార్, ట్రస్టు సభ్యులు రంగినేని రాజా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక



కోట, ఆగస్టు 25 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం వారిని స్కూలు ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, వ్యాయామా ఉపాధ్యాయులు రాజ్‌కుమార్‌లు షీల్డులు, మెమెంటోలతో అభినందించారు. ఇక్కడి గురుకులానికి చెందిన 25 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు రేణిగుంట బయలుదేరి వెళ్లారు. గెలుపొందిన విద్యార్థులకు సెప్టెంబరులో జరిగే జాతీయస్థాయి ఎంపికలు జరుగుతాయి.

నేటి నుంచి జాతీయ క్రీడాదినోత్సవ పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25: ప్రపంచ ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నుంచి 31వ తేదీ వరకు జాతీయ క్రీడాదినోత్సవ ప్రత్యేక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే క్విజ్, వ్యాసరచన పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. అంతర్ పాఠశాలలు, కళాశాలలతో పాటు జిల్లా స్థాయిలో వాకరేసు, వాలీబాల్, హాకీ, మినీపుట్‌బాల్, బ్యాడ్మింటన్, చెస్, జూడో, బాక్సింగ్, యోగా తదితర క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పతనమవుతున్న ధాన్యం ధరలపై దిగాలు

● దళారుల చేతిలో మోసపోతున్న రైతులు


ధాన్యాన్ని లారీలకు లోడ్ చేస్తున్న కూలీలు

సూళ్లూరుపేట, ఆగస్టు 25: ధాన్యం ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో పరిధిలోని పలు గ్రామాల్లో ఫిల్టర్ పాయింట్ నీటి సౌకర్యం ఉండే ప్రాంతాల్లో దాదాపు 7 వేల ఎకరాల్లో రైతులు వరి కోతలకు సిద్ధమయ్యారు. నాట్ల ప్రారంభంలో అడపాదడపా వర్షాలు కురియడంతో రైతులు ఉత్సాహంగా సాగుచేశారు. ఎం2-1010 రకం, కేఎన్ఎం-1638 రకాలను ఎక్కువగా చేశారు. అప్పులు చేసి అధిక పెట్టుబడులు పెట్టారు. చాలాచోట్ల పంట కోత దశకు చేరుకుంది. మంగానెల్లూరు, మంగళంపాడు, మన్నారుపోలూరు తదితర ప్రాంతాల్లో కోస్తున్నారు. ఇదే సమయంలో ధాన్యం ధరలు పతనమవ్వడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వారం రోజుల ముందు పుట్టి రూ.17400 నుంచి రూ.18,200 వరకు ఉంది. ప్రస్తుతం రూ.15,500 నుంచి రూ.16,000కు పడిపోయింది. కేఎన్ఎం 1638 రకం పుట్టి వారం రోజుల క్రితం రూ.22 వేలు దాకా పలికింది. ప్రస్తుతం రూ.20 వేలకు పడిపోయిందని సమాచారం. మరోపక్క దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరలకు కొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దళారులు ఇక్కడ కొనుగోలు చేసి తమిళనాడులో అధిక ధరలకు విక్రయించుకొని సొమ్ము చేసుకొంటున్నారు.

క్రికెట్ పోటీల విజేత గుండ్రావారిపాళెం జట్టు



చిల్లకూరు, ఆగస్టు 25: మండలంలోని మోమిడిలో శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం స్థానిక యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. గుండ్రావారిపాళెం జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో మోమిడి-గుండ్రావారిపాళెం జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మోమిడి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. అనంతరం గుండ్రావారిపాళెం జట్టు 15 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 153 పరుగులతో విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.40 వేటు నగదు బహుమతి, రన్నర్స్ జట్టు రూ. 20వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు.

మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి


మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోట, ఆగస్టు 25 : బీసీ కులాల కోసం మండల్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని బీఎస్పీ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. కోటలోని బీసీ కులాల ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం బీసీ ఉద్యమకారుడు మండల్ చిత్రపటానికి బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాశన భాస్కర్‌గౌడ్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ జనాభాలో 50శాతం వరకు ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. బీసీ కులగణన పూర్తిచేయగలిగితే ఆయా సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నాయకులతో భాస్కర్‌గౌడ్‌తోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి మీజూరు సుబ్రహ్మణ్యం సమీక్ష జరిపారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు


సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, ఆగస్టు 25 : మండలంలోని పాలచ్చూరులో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్‌చార్జీ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినాయకత్వం పిలుపు మేరకు సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు కోసం విస్తృతంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లోని కార్యకర్తలందరూ పాల్గొని పెద్ద సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలని కోరారు. మండల బీజేపీ అధ్యక్షుడు గోగుతోటి మురళి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నరసింహులు, సతీష్, పృథ్వీరాజ్ ఉన్నారు.

వెలుగు ఆధ్వర్యంలో సీఆర్పీలు,వీఆర్వోలకు ప్రశంసాపత్రాలు


ప్రశంసా పత్రాలను వీవోఏకి అందజేస్తున్న కూటమి నాయకులు

కోట, ఆగస్టు 25 : కోటలోని వెలుగు కార్యాలయంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ పథకం లక్‌పతిదీదీపై అవగాహన కార్యక్రమం జరిగిది. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం రత్నయ్య ఆధ్వర్యంలో పలు రంగాలలో సేవాకార్యక్రమాలు చేసిన సీఆర్‌పీలు, వీవోలకు కూటమి నాయకుల చేతులుమీదుగా ప్రసంశాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు, జడ్పీటీసీ కోటయ్య, కూటమి నాయకులు పనబాక కోటేశ్వరరావు, నెల్లూరు మోహన్‌రెడ్డి, శంకర్, భాస్కర్, ప్రసాద్, కృష్ణమ్మ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోట, ఆగస్టు 25 : మండల పరిధిలోని చిట్టేడు వద్ద ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా రుద్రవరం, ఊనుగుంటపాళెం, స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.


రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, ఆగస్టు 25: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై వైపు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతుని జేబులో సూళ్లూరుపేట నుంచి చెన్నైకి టికెట్ కనిపించింది. ఎటువంటి ఆధారాలు లేవు. కాఫీ రంగు గడుల చొక్కా, నలుపు రంగు జీన్స్ ధరించి ఉన్నాడు. 45 నుంచి 50 సంవత్సరాలుంటాయి. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకోని మహిళ ఆత్మహత్య

దొరవారిసత్రం, ఆగస్టు 25 : వేణుంబాక ఎస్టీ కాలనీకి చెందిన చిలకల శాంతి(40) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. శివారులోని పొలాల్లో వేపచెట్టుకు చీరతో ఉరి వేసుకోని మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు 20 ఏళ్ల క్రితం రమేష్ అనే వ్యక్తితో వివాహం అయింది. ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా శాంతికి మానసిక పరిస్థితి బాగాలేదు. ఇంటి నుంచి తరచూ వెళ్ళి పోవడం, తిరిగి రావడం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం కూడా ఇదేతరహాలో ఇంటి నుంచి వెళ్లి ఉరివేసుకోని చనిపోయినట్లు భావిస్తున్నారు. కేసు విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, ఆగస్టు 25 : స్థానిక గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అభిషేకాలు చేసి చందన, పుష్పాలతో అలంకరించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. వారికి పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు, ఆగస్టు 25: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలోని ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకల ప్రారంభం


కుంభాభిషేక వేడుకలకు వేదారంభం చేస్తున్న వేద పండితులు

సూళ్లూరుపేట, ఆగస్టు 25: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో సత్య జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో ఆదివారం నుంచి టీటీడీ ఆధ్వర్యంలో అష్టబంధన మహాకుంభాభిషేక వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయ. వేదపండితులు, మంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేశారు. అంకురార్పరణ తర్వాత సంప్రోక్షణ వేడుకలను ప్రారంభించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, మావిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం అకల్మషహోమం, రక్షాబంధనం, అష్టబంధన సమర్పణ వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకలు ఈనెల 28వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఇన్‌స్పెక్టర్ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున నాగసూరి

గూడూరు, ఆగస్టు 25: విద్యార్థులు అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని క్షేత్ర ప్రచార అధికారి నాగసూరి అన్నారు. ఆదివారం స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో కేంద్రసమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించిన అంతరిక్ష విశేషాల చిత్రప్రదర్శన ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయం ప్రతి భారతీయుడు గర్వించాల్సిన అంశమన్నారు. అదేసమయంలో భూమిపై పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమ్మపేరిట ఒక మొక్క అనే కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటామన్నారు. పోటీల విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. గాయత్రి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

ఎస్సీ రైతులకు టార్పాలిన్ పట్టల పంపిణీ

చిల్లకూరు, ఆగస్టు 25: కమ్మవారిపాళెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ వర్గానికి రైతులకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా మంజూరులైన టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములను ఆదివారం స్థానిక సచివాయలంలో అందజేశారు. కడివేడు ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జీ పూర్ణిమ, టీడీపీ సీనియర్ నాయకుడు పచ్చ వెంకటేశ్వర్లునాయుడు వీటిని పంపిణీ చేశారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని ఈసందర్భంగా కోరారు. ఎక్కువశాతం ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మల్లాం రోడ్డులో ఆదమరిస్తే ప్రమాదమే..



చిట్టమూరు, ఆగస్టు 25: కొత్తగుంట- మల్లాం మార్గంలోని రోడ్డు అధ్వానంగా తయారైంది. ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు పడ్డాయి. మార్జిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరద తాకిడికి దెబ్బతిన్న రోడ్డుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులు చేపట్టలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొందరు గాయపడ్డారు. ఇద్దరు మృత్యువాత పడ్డారు. సోమసముద్రం గ్రామం నుంచి రోడ్డు దారుణంగా ఉన్నప్పటికీ తట్టెడు మట్టికూడా వేసిన పాపాన పోలేదు. ఏటా సెప్టెంబర్‌లో మల్లాంలో 11 రోజులపాటు వళ్లీ దేవసేన స్వయంభు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఉత్సవాలకు వేలాది మంది భక్తులు ద్విచక్ర, ట్రాక్టర్లు, కార్లలో వస్తుంటారు. సెప్టెంబర్ 13నుంచి బ్రహ్మోత్సవాలు మొదలవుతున్నప్పటికీ ఇప్పటివరకు ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చొరవ తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

విందూరు గిరిజనకాలనీలో సమస్యలను పరిష్కరించాలి

గూడూరు అర్బన్, ఆగస్టు 25: మండలంలోని విందూరు గిరిజనకాలనీలోని సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఆదివారం గిరిజనకాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో 150కిపైగా కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. కొన్నేళ్లుగా విద్యుత్‌శాఖ అధికారులు ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయకపోవడంతో సగం మందికిపైగా విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో నివస్తున్నారన్నారు. ఇప్పటికే ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో విషసర్పాల బారినపడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్‌సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణ, వెంకటయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పవన్ ముందస్తు జన్మదిన వేడుకల్లో సామాజిక సేవలు


గమళ్లపాళెం,కోగిలిలలో రక్తదానం- వాకాడులో పార్టీ జెండా ఆవిష్కరణ

గూడూరు, ఆగస్టు 25: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ కోరారు. ఆదివారం స్థానిక గమళ్లపాళెంలోని జనసేన కార్యాలయంలో రెడ్‌క్రాస్ సహకారంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవ సమయంలో, ప్రమాదాల్లో రక్తకొరత ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలుస్తామన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మోహన్, భాస్కర్, నాగార్జున, శివ, మనోజ్, వేణు, రవి తదితరులు పాల్గొన్నారు. **చిట్టమూరు:** కోగిలిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జనసేన నాయకులు ఎంబేటి ప్రవీణ్, కుదురు రాము ఆధ్వర్యంలో విద్యా ఫౌండేషన్ సౌజన్యంతో సేవా బ్లడ్ బ్యాంక్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు కూటమి నాయకులతో కలసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 53 మంది యువకులు రక్తం దానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ యువత కార్యదర్శి కామిరెడ్డి సునీల్‌రెడ్డి, మైనార్టీ సెల్ నాయకులు రషీద్ భాష, జిల్లా జనసేన నాయకులు గోని మల్లిఖార్జున్ యాదవ్, కృష్ణారెడ్డి, నయం, శ్రీపతి రాములు, కమతం చెంగయ్య, నవీన్, నాగేంద్ర, హేమంత్, ఉదయ్ పాల్గొన్నారు. **వాకాడు:** స్థానిక అశోక్ పిల్లర్ వద్ద ఆదివారం జనసేన జెండాను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా నాయకులు మల్లికార్జున్‌యాదవ్, కృష్ణారెడ్డిలు జెండాను ఎగురవేశారు. అనంతరం బైక్‌ల్లో ర్యాలీగా వెళ్లి షాదీమంజిల్‌లో టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి నందగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాలొన్నారు. సురేష్, తీగల చంద్రశేఖర్, నయాం, అల్లంబాబు, జనసేనపార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.